RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 26 ఆగస్ట్ 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:76

## కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పూర్తి అంశాలను నివేదికలో ఇచ్చాం

### క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి




మల్లు రవి, ఎంపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, శ్యామ్ మోహన్ వైస్ చైర్మన్ తదితరులు

**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** కాంగ్రెస్ కమిటీలో క్రమశిక్షణ ప్రధానమైనది క్రమశిక్షణ పైనే పార్టీ గౌరవం ఆధారపడి ఉంటుంది

పార్టీపై గౌరవం ఉంటేనే మళ్ళీ పార్టీ అధికారంలోకి వస్తుంది

పార్టీపై నెగెటివ్ అభిప్రాయాన్ని కలిగించకుండా ఉండాలంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందే

పీసీసీ చీఫ్ ను కలిసి మా నివేదిక ఇచ్చాం

కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పూర్తి అంశాలను నివేదికలో ఇచ్చాం

మీడియాలో వచ్చిన కథనాలను చూసి ఒక అంచనాకు వచ్చాంగత విషయాలను కూడా పరిగణలోకి తీసుకున్నాంమా నివేదికను పీసీసీ చీఫ్ కి అందచేశాం


నివేదికను ఇంచార్జ్ మీనాక్షికి పంపారు

AICC చీఫ్, AICC జనరల్ సెక్రెటరీకి కూడా నివేదిక పంపిస్తారు

కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయిఈ నిర్ణయంతో నాయకులు, క్యాడర్ కు ఒక మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నాం

లెటర్ లో ఏముందో చెప్తే నాకు నోటీసులు వస్తాయిమా రిపోర్ట్ లో అన్ని విషయాలు పొందు పరిచాం

## మూసీ పై సీఎం సమీక్ష




మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు కోసం అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని ఎ. రేవంత్ రెడ్డిఅధికారులను ఆదేశించారు. భూసేకరణకు ల్యాండ్ పూలింగ్ విషయంలో స్పష్టమైన విధానం రూపొందించాలని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పై ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ఫేజ్–2 కి వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని చెప్పారు.

భూసేకరణ ప్రక్రియలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణకు స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని అన్నారు. ఇందులో న్యాయపరమైన ఎలాంటి చిక్కులు రాకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు.

మూసీ రివర్‌ఫ్రంట్‌లో భాగంగా చేపట్టే ప్రాజెక్టులకు అతి తక్కువ వడ్డీకి రుణ సదుపాయాలపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని, అలాగే టీడీఆర్‌లు జారీ చేసే విషయంలో కూడా ప్రతి వారం సమీక్షించాలని చెప్పారు.

గండిపేట మంచిరేవుల సమీపంలోని ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి తక్షణం టెండర్లు పిలవాలని ఆదేశించారు. అలాగే, కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు.



'మిలాద్ ఉన్ నబీ' పండుగ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముస్లిం సోదర, సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకునే ఈ పవిత్ర దినం ముస్లింలకు ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. ప్రవక్త మహ్మద్ బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావం, కరుణ, మానవత్వం, ధర్మబద్ధమైన జీవన విధానం సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి అన్నారు. ఆయన సందేశాలు ప్రపంచ శాంతి, సామరస్యానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ముస్లిం మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా పాలనలో తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని సీఎం స్పష్టం చేశారు. ముస్లింల సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. మిలాద్ ఉన్ నబీ ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.



ఇటీవల జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మహిళల డబుల్స్ విభాగంలో కాంస్య పతకం (Bronze Medal) సాధించిన బ్యాడ్మింటన్ జోడీ పుల్లెల గాయత్రి గోపీచంద్ – త్రిసా జాలీలను ముఖ్యమంత్రిఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ తో కలిసి వారు ముఖ్యమంత్రి ని జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీవీ లక్ష్మి ఉన్నారు.

## 'అర్హత లేని వ్యక్తులను కలవాలనుకున్నారు'..

## రేవంత్ అమెరికా టూర్‌పై కిషన్‌రెడ్డి ఫైర్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంపై సీఎం చేసిన ఆరోపణలు అర్థరహితమని మండిపడ్డారు. ఢిల్లీలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కేంద్రం అనుమతి రాకముందే రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనను హడావుడిగా ఖరారు చేసుకున్నారని ఆరోపించారు.

రేవంత్‌రెడ్డి గతంలో అమెరికా, లండన్ సహా ఇతర దేశాలకు వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈసారి మాత్రం స్పష్టమైన పరిపాలనా కారణాలతో విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వలేదని చెప్పారు. విదేశీ పర్యటనల్లో ముఖ్యమంత్రి ఎవరిని కలుస్తారు? ఆ సమావేశాలతో దేశానికి ఏమైనా ప్రయోజనం ఉందా? అనే అంశాలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుందని వివరించారు.

అమెరికా పర్యటనలో రేవంత్‌రెడ్డి అర్హత లేని వ్యక్తులను కలవాలని నిర్ణయించుకున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరించే, భారత్‌పై విమర్శలు చేసే వ్యక్తితో సమావేశం ఎందుకని ప్రశ్నించారు. ప్రధాని మోదీని ఉగ్రవాదితో పోల్చిన వ్యక్తి న్యూయార్క్ మేయర్ మమ్దానీ కాదా? అని నిలదీశారు. న్యూయార్క్‌లో హిందువుల పండుగలపై ఆంక్షలు విధించిన వ్యక్తితో సీఎం భేటీ కావడం ఏంటని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి తన హోదాకు తగిన వ్యక్తులతోనే చర్చలు జరపాలని కిషన్‌రెడ్డి సూచించారు. సీఎం స్వయంగా విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. పెట్టుబడుల కోసం అధికారుల బృందాన్ని పంపినా ప్రయోజనం ఉంటుందని చెప్పారు. 2005లో గుజరాత్ సీఎంగా ఉన్న నరేంద్ర మోదీ అమెరికా పర్యటనను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకున్న విషయాన్ని కూడా కిషన్‌రెడ్డి గుర్తు చేశారు.



## ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి: హరీశ్ రావు

**22ఏ బాధితుల సమావేశానికి హాజరైన హరీశ్ రావు**

**లక్షలాది మందికి కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపాటు**

**పొంగులేటి అత్యాశ ఆయన దుఃఖానికి కారణమవుతుందని వ్యాఖ్య**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 22ఏ (22ఎ) బాధితుల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వివేకానందతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తప్పు చేసింది ప్రభుత్వమైతే, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు.



వందలాది కాలనీల అధ్యక్షులు, వేలాది మంది బాధితులు తమ భూములను నిషేధిత 22ఏ జాబితాలో పెట్టారంటూ ఆవేదనతో ఇక్కడికి వచ్చారని హరీశ్ రావు పేర్కొన్నారు. "భూములను 22ఏలో పెట్టడం మీ వంతు.. మళ్లీ వాటిని తొలగించుకోవడానికి దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగడం ప్రజల వంతా?" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సూటిగా నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పును వెంటనే సవరించాల్సిన బాధ్యత మంత్రిపైనే ఉందన్నారు. లక్షలాది మంది ఆస్తులను రాత్రికి రాత్రి 22ఏ జాబితాలో చేర్చి, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపడ్డారు.

30 శాతం కమీషన్ల దురాశతోనే ఈ భూములన్నింటినీ 22ఏలో పెట్టారంటూ హరీశ్ రావు ఆరోపించారు. మంత్రి అత్యాశ ఏదో ఒకరోజు ఆయన దుఃఖానికి కారణమవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ కుట్రల వల్ల లక్షలాది మంది జీవితాలు నాశనమవుతున్నాయని... పిల్లల పెళ్లిళ్లు ఆగిపోతున్నాయని, దవాఖాన ఖర్చుల కోసం ఆస్తులను బ్యాంకుల్లో కుదువ పెడదామంటే బ్యాంకులు సైతం తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాపర్టీల విలువలు పడిపోయి, అప్పు పుట్టక, ఆస్తులు అమ్ముకోలేక బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాబట్టి ప్రజలతో ఆన్‌లైన్ దరఖాస్తులు పెట్టించకుండా, ప్రభుత్వం వెంటనే ఈ 22ఏ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## క్యూఆర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి వడివడిగా అడుగులు

**15 నియోజకవర్గాల్లో టెండర్ ప్రక్రియ పూర్తి**

**అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలో**

**ఈ నెల 28 నుంచి 31 వరకు పారదర్శకంగా లక్కీ డ్రా**

**మరో 4 నియోజకవర్గాల్లో దరఖాస్తులకు ఆహ్వానం**

**సెప్టెంబర్ 3 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్:– హైదరాబాద్ మహా నగరంలోని క్యూర్ పరిధిలో సొంతింటి కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాల కలలను నిజం చేసే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు ముందుకు వేసిందని పేదవాడికి కూడా నగరంలో సొంత ఇల్లు ఉండాలని, ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి గారి నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. .

మంగళవారం సచివాలయంలో హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పురోగతి, లబ్ధిదారుల ఎంపిక, లక్కీ డ్రా నిర్వహణ, కొత్త నియోజకవర్గాల్లో దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే టెండర్లు ప్రక్రియను పూర్తిచేశామని వెల్లడించారు. క్యూఆర్ పరిధిలోని తొలి విడతలో ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో 807.40 కోట్ల అంచనా వ్యయంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని ఇందుకోసం జూన్ 20 నుంచి ఆగస్టు 15 తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించగా మొత్తం 60,720 దరఖాస్తులు అందాయని, వచ్చిన .దరఖాస్తులపై 360 డిగ్రీల క్షేత్రస్థాయి పరిశీలన, సమగ్ర విచారణ అనంతరం 40,900 మందిని అర్హులుగా, 19,820 మందిని అనర్హులుగా గుర్తించామన్నారు. అనర్హతకు గల కారణాలను దరఖాస్తుల వారీగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు మంత్రి గారు తెలిపారు.

మిగతా 2 లో

ప్రజాబలం

26 ఆగస్ట్ 2026 బుధవారం

## మోడీ 3.0 ఎందుకింత మెతక వైఖరి

నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇటీవలి పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీలు గణనీయమైన ఆధిపత్యం ప్రదర్శించాయి. వీధి ఉద్యమాలపై ప్రభుత్వం అనుసరిస్తున్న మెతక వైఖరి, దాని నిర్ణయాల దృఢత్వంపై సందేహాలు తలెత్తిస్తోంది.. తాజాగా ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద రాహుల్ గాంధీ చేసిన ధర్నా చర్చనీయాంశమైంది. పెల్లెట్ గాయాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ ఐదున్నర గంటలపాటు రోడ్డుపై కూర్చుని ధర్నా చేశారు. అయితే లలితా కుమారి కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఎఫ్ఐఆర్‌కు ముందు లోతైన దర్యాప్తు, చర్చలు అవసరం. ఆరు వారాల సమయం ఉన్నప్పటికీ, ధర్నా తర్వాతనే ఎఫ్ఐఆర్ నమోదు కావడం అనుమానాలకు తావిస్తోంది. ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతం కావడంతో లెఫ్టినెంట్ గవర్నర్, హోం శాఖ అధికారుల అనుమతి అవసరం. అయినా ఈ ప్రక్రియకు ఐదున్నర గంటలు పట్టడం, లేదా ఉద్దేశపూర్వకంగా ప్రచార అవకాశం కల్పించడమా అనే ప్రశ్నలు బీజేపీ అనుచరుల్లోనూ వినిపిస్తున్నాయి. ముందే నమోదు చేసి ఉంటే ఈ మీడియా దృష్టి తప్పేది.రైతు ఉద్యమాల తర్వాత మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గిన సందర్భాలు ఉన్నాయి. దీన్ని హింస నివారణకు తీసుకున్న నిర్ణయంగా చాలామంది అభివర్ణించారు. అయితే ప్రతిపక్షాలు వీధి ఆందోళనల ద్వారా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయవచ్చని గ్రహించినట్లు కనిపిస్తోంది. నోయిడాలో కార్మికుల ఆందోళన వెనుక అర్బన్ నక్సల్ ప్రభావం ఉందని చెప్పబడుతున్నా, అది సాధారణ ప్రజలకు అంతగా తెలియలేదు. అభిజిత్ దీప్కే నేతృత్వంలోని నీట్ లీకేజీ వ్యతిరేక నిరసనలు, సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష వంటి సందర్భాల్లో ప్రభుత్వం సమయానుకూలంగా నియంత్రించలేకపోయింది. పార్లమెంటు సమీపంలో హింసాత్మక పరిస్థితులకు అవకాశం ఏర్పడటం ప్రభుత్వ నిర్ణయాల్లో స్పష్టత లోపాన్ని సూచిస్తోంది.

నక్సలైట్ సమస్య, ఈశాన్య రాష్ట్రాలు, మణిపూర్, నాగాలాండ్‌లోని అల్లర్లను కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా అదుపులో ఉంచింది. కానీ ఢిల్లీ విషయంలో మెతక వైఖరి కనిపిస్తోంది. అభిజిత్ దీప్కే పాఠశాలలను సందర్శించడం లాంటి చర్యలు అధికారం లేకుండానే జరుగుతున్నాయి. ఇది ఉపాధ్యాయుల కార్యకలాపాలకు ఆటంకం కలిగించినా, ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవడం లేదు. జెన్‌జీ ఉద్యమాలు ఉధృతం కాకుండా ఉండాలని కోరుకున్నా, అతి మెతక వైఖరి వల్ల వ్యతిరేక ప్రభావం పడుతుందని విమర్శలు వస్తున్నాయి.సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కమిటీ ఇప్పటికే పెల్లెట్ ఘటనలు, దాడులపై విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో అదనపు ఎఫ్ఐఆర్‌లు, ధర్నాలు అవసరమా అనే ప్రశ్న ఉంది. ప్రభుత్వం గతంలో చూపిన దృఢత్వాన్ని ఢిల్లీ వంటి కీలక ప్రాంతాల్లోనూ కొనసాగిస్తేనే దాని నిర్ణయాలపై నమ్మకం నిలుస్తుంది. లేనిపక్షంలో వీధి ఆందోళనలు మరింత బలపడి, పాలనా సామర్థ్యంపై ప్రశ్నలు తీవ్రమయ్యే అవకాశం ఉంది..2014లో 'అచ్చే దిన్' నినాదంతో అధికారంలోకి వచ్చిన మోదీ, 2019లో పుల్వామా నేపథ్యంలో స్థిరమైన ప్రభుత్వ అవసరాన్ని నొక్కి చెప్పి 303 సీట్లు సాధించారు. 2024లో 'అబ్‌కీ బార్ చార్‌సౌ' పిలుపు ఉన్నప్పటికీ బీజేపీ 240 సీట్లకు పరిమితమైంది. కాంగ్రెస్ 99 సీట్లతో మెరుగైన ప్రదర్శన ఇచ్చింది. రాహుల్ గాంధీ రెండు స్థానాల్లో విజయం సాధించారు. ఈ దశలో విపక్షాలు బలపడినట్లు కనిపించింది. అయితే తర్వాతి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మహారాష్ట్ర, హర్యానా, పశ్చిమ బెంగాల్‌లో సత్తా చాటింది. ప్రభుత్వం లేని రాష్ట్రాల్లో కూడా ఓట్లు, సీట్లు పెరిగాయి. 2025 చివరి నుంచి కాంగ్రెస్ విమర్శలు పదునెక్కినప్పటికీ, మోదీ వద్ద స్పష్టమైన ఇష్యూ లేకపోవడం గమనార్హం. ఇలాంటి సమయంలోనే ఆయన రెండు మాస్టర్ స్ట్రోక్స్ ప్రదర్శించారు.స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మోదీ వాడిన 'దిమాగీ నక్సల్స్' పదం చర్చనీయాంశమైంది. దీనిని దేశ వ్యతిరేక శక్తులు, అభివృద్ధికి అడ్డుగా నిలిచేవారు అనే అర్థంలో వాడినట్లు అర్థం చేసుకోవచ్చు. ఆసక్తికరంగా, మావోయిస్టు పార్టీలు, వామపక్షాలు, ఎస్పీ, ఆర్జేడీ, టీఎంసీ, డీఎంకే వంటి పార్టీలు స్పందించలేదు. కానీ కాంగ్రెస్ నేత చిదంబరం తొలుత స్పందించి, ఆ తర్వాత పార్టీ, దాని అనుబంధ సంస్థలు ఈ పదాన్ని తమకు అన్వయించుకున్నాయి. మోదీ ఒక్కసారి చెప్పిన పదాన్ని కాంగ్రెస్ తరచూ వాడుతూ, తమను తాము ఆ వర్గంలోకి చేర్చుకున్నట్లు చిత్రం ఏర్పడింది. ఇది విపక్షాల మధ్య విభేదాలను బయటపెట్టింది. ఇతర పార్టీలు దూరం ఉండగా, కాంగ్రెస్ మాత్రం దానిని ఓన్ చేసుకోవడం రాజకీయంగా నష్టకరం.ఇక రెండో అంశం వందేమాతరం పూర్తిగా పాడాలనే చట్టం. ముస్లిం పార్టీలు కూడా దీన్ని వ్యతిరేకించలేదు. అన్ని పార్టీల నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆగస్టు 15న పాడకపోయినా లేచి నిలబడ్డారు. కమ్యూనిస్టులు, ఇతర విపక్షాలు స్పందించలేదు. కానీ కాంగ్రెస్ వైపు నుంచి సోనియా గాంధీ వందేమాతరం పాడుతుంటే ఆపే ప్రయత్నం చేసిన వీడియో వైరల్ అయి విమర్శలకు తావిచ్చింది. అంతేకాదు 1950లో నెహ్రూ తీర్మానం ప్రకారం వందేమాతరం పాడతామని కాంగ్రెస్ తీర్మానం చేసింది. దీంతో నెహ్రూ జిన్నా కోసం రెండు చరణాలకు పరిమితం చేసిన చరిత్ర ఉంది. పూర్తి పాట రాకపోయినా, పాట వచ్చినప్పుడు లేచి నిలబడి గౌరవించడం సాధారణం. ఇందులో కూడా కాంగ్రెస్ నేతలు ఇష్టపడకపోవడం, పాకిస్తాన్ ముస్లిం లీగ్‌కు అనుకూలం అనే ముద్రను బలపరిచింది. ముస్లిం ఓట్లకు మద్దతు ఇస్తున్న కాంగ్రెస్, అస్సాం, బెంగాల్, జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాల్లో అధికారంలో లేకపోవడం మరో వైరుధ్యం.ఈ రెండు అంశాలు కాంగ్రెస్‌ను సెల్ఫ్ గోల్స్ కొట్టుకునేలా చేశాయి. మోదీ ప్రస్తావించినప్పుడు ఇతర పార్టీలు నిశ్శబ్దంగా ఉండగా, కాంగ్రెస్ మాత్రం ప్రతిస్పందించి, తన స్థానాన్ని బలహీనపరిచుకుంది. జాతీయవాదం, దేశభక్తి అంశాల్లో విపక్షాల మధ్య సమన్వయం లేకపోవడం స్పష్టమైంది. రాబోయే రోజుల్లో ఈ రెండు అంశాలు కాంగ్రెస్‌ను నిరంతరం ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది. పైచేయి సాధించిన దశలో వ్యూహాత్మకంగా వ్యవహరించకపోవడం, మోదీ వలను గుర్తించలేకపోవడం ప్రధాన కారణం.

# ఏడాదిలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యం

## స్పష్టమైన కార్యాచరణతో పనులు వేగవంతం చేయాలి

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి





హైదరాబాద్, ఆగస్టు 25: దేవాదుల ప్రాజెక్టును ఏడాదిలోగా వందశాతం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.

ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి గారి అధ్యక్షతన మంగళవారం నాడు జలసోద లో దేవాదుల ప్రాజెక్టు పై జరిగిన సమీక్షలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రాజెక్టు పనులను ప్రారంభం నుంచి ముగింపు వరకు సమగ్రంగా సమీక్షించి, ఎక్కడ పనులు నిలిచిపోయాయి, అందుకు కారణాలేంటి.. వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలేంటి అనే అంశాలను పాయింట్‌వారీగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

సమస్య ను గుర్తించకుండా పనులు పూర్తవుతాయి అంటూ కాలయాపన చేయడం సరికాదని, ప్రతి సమస్యకు స్పష్టమైన పరిష్కారం, బాధ్యత, గడువు నిర్ణయించాలని అధికారులకు సూచించారు.

భూసేకరణ, అనుమతులు, నిర్మాణ పనులు, నిధులు, కాంట్రాక్టు ఏజెన్సీలకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు, ఇంజినీర్లు, ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

ప్రాజెక్టుపై పూర్తి అవగాహన ఉన్న అధికారులతో స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు సమగ్ర సమీక్ష నిర్వహించి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

సమస్య ఎక్కడ ఉందో ముందుగా గుర్తించాలి.. కారణాన్ని విశ్లేషించాలి.. పరిష్కారాన్ని ఖరారు చేసి అమలు చేయాలి. ఫలితం వచ్చే వరకు నిరంతరం పర్యవేక్షించాలి. దేవాదుల పూర్తి విషయంలో ఎలాంటి కాలయాపనకు తావులేదుఅని మంత్రి స్పష్టం చేశారు

# క్యూఆర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి వడివడిగా అడుగులు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఈ నెల , 28, 29, 30,31 తేదీల్లో ఆయా ప్రాంతాల్లోని ప్రత్యేక ఫంక్షన్ హాళ్లలో ప్రజలు, అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలోనే పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహిస్తామని ప్రతి కేంద్రానికి ఒక ప్రత్యేక పర్యవేక్షణాధికారిని కూడా నియమించామని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల తుది జాబితా ప్రకటించిన తర్వాత ఎంపిక కాని దరఖాస్తుదారులకు వారు చెల్లించిన రూ. 10,000 ఈఎండీ మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లోకి తిరిగి జమ చేస్తామని మంత్రి గారు స్పష్టం చేశారు.

28వ తేదీన రాయదుర్గం, కెపిహెచ్‌బి కాలనీ, మైలార్‌దేవరపల్లి, రెడ్ హిల్స్, 28న కౌకూర్,పాటిగెడ్డ,జల్‌పల్లి, కుల్సుంపుర , 30న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కోలనీ, బోయన్‌పల్లి, బండ్లగూడ ( ఎల్ఐజి కాలనీ), నందిముసలిగుడ, 31వ తేదీన గాజుల రామారం, అంబర్ పేటలోని సిటీపోలీస్ లైన్స్, గడ్డిన్నారం, ఆర్‌డబి క్వార్టర్స్,పోచారం ( ఎల్ఐజి కాలనీ)లో లక్కీడ్రా నిర్వహిస్తారని మంత్రి తెలిపారు.

మరో నాలుగు నియోజకవర్గాల్లో స్థలాల ఎంపిక

క్యూర్ పరిధిలో కొత్తగా మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థలాలను ఎంపిక చేశామని తెలిపారు .ఒక్కో నియోజకవర్గంలో 480 ఇళ్ల చొప్పున మొత్తం 1,920 ఇళ్లను నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం లో హయత్‌నగర్ గ్రామంలోని అమంగల్, గోషామహల్ నియోజకవర్గంలోని నాంపల్లి, ముషీరాబాద్ నియోజకవర్గంలోని జమిస్తాన్‌పూర్ (ఆర్టీసీ క్వార్టర్స్), చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడలో (ఫలక్‌నుమా సమీపంలో) ఇళ్లు నిర్మించేందుకు వీలుగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నాలుగు నియోజకవర్గాల పరిధిలోని అర్హులైన ప్రజలు ఇందిరమ్మ టవర్స్ కోసం సెప్టెంబర్ 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పొంగులేటి తెలిపారు. గతంలో 16 నియోజకవర్గాలకు వర్తింపజేసిన నిబంధనలే ఈ కొత్త దరఖాస్తులకూ వర్తిస్తాయన్నారు

ఇందిరమ్మ టవర్స్ ప్రత్యేకత కేవలం అపార్ట్‌మెంట్‌లో ఒక ఇల్లు ఇవ్వడంలోనే లేదని నగరంలో విలువైన భూమిపై ఒక కుటుంబానికి శాశ్వత ఆస్తి, భద్రమైన భవిష్యత్, ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతిపాదిత ప్లాట్ విస్తీర్ణం 525 చదరపు అడుగులు. అన్‌డివైడెడ్ షేర్ విధానంలో సుమారు 20--25 గజాల భూమిని లబ్ధిదారుల పేరుతో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నామని ప్రాంతాన్ని బట్టి లబ్ధిదారులకు అందే భూమి విలువ రూ.60 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఉండనుందన్నారు.

ఇంత విలువైన ఆస్తిని పేద కుటుంబానికి అందించడంతో పాటు, ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల పూర్తి సబ్సిడీ అందిస్తోందని లబ్ధిదారుడి వాటా కేవలం రూ.6 లక్షలు మాత్రమే, అది కూడా నాలుగు విడతల్లో చెల్లించే విధంగా అవకాశం కల్పించామన్నారు.

జీవితాంతం అద్దె ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి నుంచి ఒక పేద కుటుంబాన్ని బయటకు తీసుకువచ్చి, నగరంలోనే సొంతింటి యజమానిగా నిలబెట్టడమే ఇందిరమ్మ టవర్స్ లక్ష్యమన్నారు.

# ధర్మపురి అర్వింద్ పై పోలీసు నిఘా పెట్టలేదు: తెలంగాణ డీజీపీ



హైదరాబాద్, ఆగస్టు 25 తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు తనపై పోలీసు నిఘా ఉంచారని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ చేసిన సంచలన ఆరోపణలను రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తోసిపుచ్చారు. రేవంత్ సోదరుడి సూచనల మేరకు తన కదలికలపై నిఘా ఉంచేందుకు ఒక ఏసీపీ స్థాయి పోలీసు అధికారిని నియమించారంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎక్స్ వేదికగా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ఉద్దేశించి సంచలన పోస్ట్ చేశారు. తెలంగాణ పోలీసు యంత్రాంగం భారత రాజ్యాంగానికి, చట్టబద్ధమైన అధికార పరిధికి కట్టుబడి పనిచేస్తోందా లేక సీఎం కుటుంబ సభ్యుల ఆదేశాలతో నడుస్తోందా అని ఆయన తన ట్వీట్‌లో ప్రశ్నించారు. ఎంపీ పోస్టుపై వెంటనే స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, సంబంధిత అధికారులతో సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను ధ్రువీకరించుకున్నామని తెలిపారు. ఎంపీని అనుసరించడానికి గానీ, ఆయనపై నిఘా ఉంచడానికి గానీ ఏ అధికారిని నియమించలేదని స్పష్టం చేశారు. తెలంగాణ పోలీసు శాఖ ఇటువంటి నిఘా పద్ధతులను ఎన్నడూ అనుసరించదని, కేవలం రాజ్యాంగబద్ధమైన విధులకు మాత్రమే కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. అయినప్పటికీ, ఈ వ్యవహారానికి సంబంధించి ఎంపీ వద్ద ఏవైనా నిర్దిష్టమైన ఆధారాలు లేదా సమాచారం ఉంటే నేరుగా తనకు వ్యక్తిగతంగా అందజేయవచ్చని, వాటి ఆధారంగా పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపిస్తానని డీజీపీ హామీ ఇచ్చారు. డీజీపీ ఇచ్చిన ఈ వివరణతో ఎంపీ వర్సెస్ పోలీసు నిఘా వివాదంలో చెలరేగిన రాజకీయ దుమారానికి తెరదించే ప్రయత్నం చేశారు.

అర్వింద్ ఏమన్నారంటేనిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సోమవారం తెలంగాణ ప్రభుత్వం, పోలీసు యంత్రాంగంపై సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు, ఒక ఏసీపీ స్థాయి అధికారి తన కదలికలపై నిఘా ఉంచినట్లు ఆయన ఆరోపించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ఉద్దేశించి ఆయన ఒక పోస్ట్ చేశారు."డీజీపీ సీవీ ఆనంద్ గారూ, మీరు నాకు దశాబ్దాలుగా తెలుసు. మిమ్మల్ని ఎప్పుడూ ఒక సమర్థవంతమైన అధికారిగానే పరిగణించాను. అయితే, ముఖ్యమంత్రి సోదరుడి ఆదేశాల మేరకు ఒక ఏసీపీ స్థాయి అధికారికి నా కదలికలను పర్యవేక్షించే బాధ్యతను అప్పగించినట్లు నా దృష్టికి వచ్చింది" అని అర్వింద్ తన పోస్టులో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన పోలీసుల పనితీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "తెలంగాణ పోలీసులు రాజ్యాంగానికి, చట్టబద్ధమైన అధికార యంత్రాంగానికి లోబడి పనిచేస్తారా? లేక ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ఆదేశాల మేరకు నడుచుకుంటారా? అనేది ఇక్కడ ఉత్పన్నమవుతున్న ప్రాథమిక ప్రశ్న" అని ఆయన నిలదీశారు. పోలీసులు కేవలం చట్టానికి మాత్రమే జవాబుదారీగా ఉండాలని, ఏ రాజకీయ కుటుంబానికీ కాదని తాను ఆశిస్తున్నట్లు అర్వింద్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే సండ్ర విమర్శలు

**10 ఏళ్లలో చేయని అభివృద్ధి రెండున్నర ఏళ్లలో చేసిన ఘనత ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ దే**

**సిరిపురం మేజర్ లో రైతులందరికీ సాగర్ జలాలు అందిస్తాం**

**విలేకరుల సమావేశంలో తల్లాడ మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి**



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం ఆగస్టు 25:**గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 10ఏళ్లలో జరగని అభివృద్ధి.. సత్తుపల్లి నియోజకవర్గంలో రెండున్నర సంవత్సరాలలోనే జరిగిందని, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే సండ్ర విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి గారు అన్నారు. మంగళవారం తల్లాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయలేదని తప్పుడు ప్రచారం చేయటం సరైనది కాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో 10 ఏళ్ళు ఉండి ఎవరికి న్యాయం చేయలేదన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్తు, రైతు భరోసా, రైతు బీమా, ఆరోగ్యశ్రీ 19 లక్షలు పెంపు లాంటి మహోత్తర కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. సీతారామ ప్రాజెక్ట్ కెసిఆర్ రూపొందించారని అబద్ధాలు ఆడుతున్న సండ్రా అది 2004లోనే దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే శంకుస్థాపన చేయటం జరిగిందని గుర్తు చేశారు. సాగర్ జలాలు ప్రతి రైతుకి అందిస్తామని అన్నారు. సిరిపురం మేజర్ కాలువకు మరమ్మత్తులు జరుగుతున్న నేపథ్యంలో కొంత ఆలస్యం అవుతుందని, మరో ఐదు రోజుల్లో సాగర్ జలాలు వస్తాయని అన్నారు. సాగర్ జలాలు ఇవ్వకపోతే ముట్టడి చేస్తామని చెబుతున్న మాజీ ఎమ్మెల్యే మీరు అధికారంలో ఉన్నప్పుడు ధర్నా చౌక్ లను ఎత్తేసారన్న సంగతి గుర్తుంచుకోవాలని అన్నారు. ఇప్పటికైనా అబద్దాలు మాని, అభివృద్ధిని స్వాగతించాలని అన్నారు. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని వాటిని గమనించి సహకరించాలని, లేని పక్షంలో ప్రజలే మరోసారి గుణపాఠం చెప్తారని వారు హెచ్చరించారు. అన్నారుగూడెంలో మేజర్ కాలువకు ఇరువైపుల ఉన్న ఎస్సీ కాలనీలు కాలవస్తున్న సమయంలో వరద పోటెత్తి కాలనీలు మునిగిపోయే ప్రమాదం ఉన్నందున ఎస్సీ కాలనీలు దాటి రెండు కిలోమీటర్ల వరకు కూడా రిటైనింగ్ వాల్ ల నిర్మిస్తూ వరద పోటెత్తిన సమయంలో ప్రమాదం జరగకుండా ఎస్సీ కాలనీలకు శాశ్వత పరిష్కారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు సర్పంచులు, ఉప సర్పంచులు వార్డు సభ్యులు కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు, యువజన సంఘాల నాయకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# అసెంబ్లీ లైబ్రరీ చైర్మన్‌గా డాక్టర్ మట్టా రాగమయి ప్రమాణ స్వీకారం




**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 25:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ లైబ్రరీ చైర్మన్‌గా నియమితులైన సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ స్పీకర్ చాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి శ్రీధర్‌బాబు అభినందనలు తెలిపారు. అసెంబ్లీ లైబ్రరీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో శాసనసభ్యురాలు పర్ణిక రెడ్డి, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శి, జాయింట్ సెక్రటరీతో పాటు పలువురు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న డాక్టర్ మట్టా రాగమయికి అసెంబ్లీ లైబ్రరీ చైర్మన్ పదవి దక్కడం పట్ల నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## రాజకీయ 'రిటైర్మెంట్'పై గడ్కరీ వ్యాఖ్యలు? క్లారిటీ ఇచ్చిన కార్యాలయం

**తన వ్యాఖ్యలపై వస్తున్న ఊహాగానాలకు తెరదించిన నితిన్ గడ్కరీ**

**అవి రాజకీయాలకు సంబంధించినవి కావని స్పష్టం చేసిన ఆయన కార్యాలయం**

**ఓ సేవా కార్యక్రమంలో కొత్త తరానికి బాధ్యతలు అప్పగించాలని వ్యాఖ్య**

**తన రాజకీయ భవిష్యత్తుపై కాదని, ట్రస్ట్ గురించే మాట్లాడానని వెల్లడి**

కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాజకీయాల నుంచి తప్పుకుంటున్నారంటూ సాగుతున్న ప్రచారాన్ని ఆయన కార్యాలయం ఖండించింది. "కొత్త తరానికి బాధ్యతలు అప్పగించాలి" అంటూ గడ్కరీ చేసిన వ్యాఖ్యలను కొన్ని మీడియా సంస్థలు వక్రీకరించాయని, వాటికి ఆయన రాజకీయ భవిష్యత్తుతో ఎటువంటి సంబంధం లేదని మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.



నాగ్‌పూర్ జిల్లా కటోల్‌లో లక్ష్మణ్‌రావ్ మాన్కర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఏకలవ్య ఏకల్ విద్యాలయ" ఉపాధ్యాయ శిక్షణా తరగతులకు గడ్కరీ హాజరయ్యారు. గిరిజన ప్రాంతాల్లో ఏక ఉపాధ్యాయ పాఠశాలలను నిర్వహిస్తూ వారి అభ్యున్నతికి ఈ ట్రస్ట్ కృషి చేస్తోంది. ఈ కార్యక్రమంలో గడ్కరీ ప్రసంగిస్తూ, "గతంలో పనిచేసినంత వేగంగా ఇప్పుడు నేను పనిచేయలేకపోతున్నాను. అందుకే కొత్త తరానికి బాధ్యతలు అప్పగించాలని సూచిస్తున్నాను. పాత తరం మార్గదర్శకత్వంలో కొత్తవారు బాధ్యతలు స్వీకరిస్తే సంస్థ పురోగమిస్తుంది" అని పేర్కొన్నారు.అయితే, ఈ వ్యాఖ్యలను కొన్ని మీడియా ఛానెళ్లు ఆయన రాజకీయ సన్యాసానికి సంకేతాలుగా అభివర్ణిస్తూ కథనాలను ప్రసారం చేశాయి. త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ జరగవచ్చన్న ఊహాగానాల మధ్య ఈ వార్తలకు మరింత ప్రాధాన్యత లభించింది.దీనిపై గడ్కరీ కార్యాలయం తక్షణమే స్పందిస్తూ వివరణ ఇచ్చింది. ఆ వ్యాఖ్యలు కేవలం మాన్కర్ ట్రస్ట్ భవిష్యత్ నాయకత్వం, దాని కార్యకలాపాలకు సంబంధించినవి మాత్రమేనని, వాటిని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదని స్పష్టం చేసింది. నితిన్ గడ్కరీ రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ఎటువంటి ప్రకటన వెలువడలేదని, ఆయన యధావిధిగా నరేంద్ర మోదీ మంత్రివర్గంలో సీనియర్ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని పేర్కొంది.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేసి చూపిస్తాం.

**సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాల్సిందే.**

**మార్కెట్‌లో మౌలిక వసతుల కల్పిస్తాం.**

**పాముకాటుకు గురైన కార్మికుడికి మెరుగైన వైద్యం అందించాలి.**

**పర్యావరణ పరిరక్షణ అందరి సామాజిక బాధ్యత.**

**కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్.**

**చంద్రుగొండ/ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 25 ప్రజాబలం ప్రతినిధి :** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేసి చూపిస్తాం అని, ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో కార్పొరేషన్ను సుందరంగా తీర్చిదిద్దుతామని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ స్పష్టం చేశారు. మంగళవారం కార్పొరేషన్








పరిధిలోని పాల్వంచ డివిజన్ లో విస్తృతంగా పర్యటించారు. పోలీసు పెట్రోల్ బంక్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ పనులను పరిశీలించారు. మున్సిపల్ శాఖ అధికారులను, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ లో మున్సిపల్, ఎలక్ట్రికల్ శాఖల అధికారులతో కలిసి కాలినడకన వ్యాపారులు, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న కరెంటు స్తంభాలను తక్షణమే రోడ్డుకు ఇరువైపులా చివరి భాగంలో స్తంభాలను వేసి వాహన చోదకులకు ఇబ్బంది లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అధికారులు రోజు చెత్త సేకరించే విధంగా, రోడ్లు, డ్రైనేజీలు శుభ్రం చేసే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న మున్సిపల్ శానిటేషన్ వర్కర్ విజయ్ ను పరామర్శించి వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజయకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. హాస్పటల్ పరిసరాల్లో వైద్యులు వైద్య సిబ్బంది, ఆసుపత్రి సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ అడుసుమిల్లి సాయిబాబా, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, మున్సిపల్ అదనపు కమిషనర్ విజయానంద్, విద్యుత్ శాఖ ఏడిఈ అబ్దుల్ రెహమాన్, ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంటెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు, ఆర్ ఎం ఓ డాక్టర్ సోమరాజు దొర, సిపిఐ నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, ఆలపాటి ప్రసాద్, కాకటి రవీందర్, అల్లి వెంకటేశ్వర్లు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీ నవీన్ పెట్టెం:








హైద్రాబాద్ ఆగస్ట్ 25; ?టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మరియు ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ సమక్షంలో.. టీపీసీసీ సోషల్ మీడియా నూతన ఛైర్మన్ గా నవీన్ పెట్టెం మంగళవారం గాంధీ భవన్ లో అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

?ఛైర్మన్‌తో పాటు నూతనంగా నియమితులైన సోషల్ మీడియా కన్వీనర్లు, కోఆర్డినేటర్లు కూడా తమ తమ బాధ్యతలను స్వీకరించారు.

?ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ, టీపీసీసీ మీడియా ఛైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి , జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ , రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ , యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి , వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మరియు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

?పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నవీన్ పెట్టెం మాట్లాడుతూ.. "ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, క్షేత్రస్థాయి మరియు గ్రామస్థాయి సమస్యలను పీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం, అలాగే 2029లో కాంగ్రెస్ పార్టీని 100 స్థానాలలో గెలిపించి, మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి అహర్నిశలు శ్రమించడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు.

# కూటమిలో ఎవరి బలం ఎంత

విజయవాడ, ఆగస్టు 25, ఆంధ్రప్రదేశ్ లో కూటమిలో ఏ పార్టీ బలంగా ఉన్నాయంటే అన్నీ వేళ్లూ టీడీపీ వైపు చూపుతాయి. టీడీపీకి నాలుగు దశాబ్దాల చరిత్ర ఉంది. క్షేత్ర స్థాయిలో బలం ఉంది. తెలుగుదేశం పార్టీకి ఒకే ఒక మైనస్ సొంతంగా పోటీ చేసి ఎప్పుడూ గెలవకపోవడమే. అదే పొత్తులతో ఇప్పటి వరకూ చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. కానీ సీట్ల పంపకాల విషయంలో మాత్రం ఖచ్చితంగా టీడీపీదే పై చేయిగా ఉంటుంది. ఎందుకంటే బలం, బలగం అధికంగా ఉన్న తెలుగుదేశం పార్టీ రాజీ పడే అవకాశముండదు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను విస్మరించే అవకాశం లేదు. ఎన్నాళ్ల నుంచో కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్న ధోరణిలో ఉన్నారు. అందులోనూ టీడీపీకి అనుభవం ఉన్న చంద్రబాబు నాయకత్వం ఉంది. ఓడిపోయినా.. గెలిచి సత్తా చూపించిన చరిత్ర ఆ పార్టీది. అలాగే ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ఎప్పుడూ టీడీపీ రాష్ట్రంలో ఏ స్థానాల్లోనైనా రాజీ పడలేదు. ఎమ్మెల్సీ స్థానాలను కూడా తమ సంఖ్యకు అనుగుణంగా సాధించుకుంది. గత ఎన్నికల్లో 130కి పైగా స్థానాలను సాధించిన ఆ పార్టీకి ఎక్కువ స్థానాలను ఆశించడంలో తప్పులేదు. అలాగే కూటమిలోని విపక్షాలు అత్యాశకు పోవడం కూడా మంచిది కాదు. ఎందుకంటే.. స్థానిక సంస్థల ఎన్నికలు క్యాడర్ తో పాటు పార్టీని బలోపేతం చేసేవి కావడంతో ఖచ్చితంగా ఈ ఎన్నికలను సైకిల్ పార్టీ సవాల్ గా తీసుకుంటుంది. గత వైసీపీ పాలనలో పోటీ చేసి ఒక్క స్థానంలో గెలవలేదన్న కసి టీడీపీ నేతల్లోనూ, కార్యకర్తల్లోనూ కనిపిస్తుంది. ఆ అవకాశాన్ని ఇప్పుడు వదులుకోలేరు. చంద్రబాబు కూడా అందుకు అంగీకరించే అవకాశాలుండవు. బలమైన పార్టీ కావడంతో... ఏ పక్షమైనా తమ బలాన్ని బట్టి ముందుకు వెళితే ప్రత్యర్థి పార్టీని కట్టడి చేయవచ్చు. 175 నియోజకవర్గాల్లో బలంగా ఉన్న టీడీపీకి, మిగిలిన రెండు పార్టీలకు చాలా వ్యత్యాసం ఉంది. అవి కేవలం కొన్ని నియోజకవర్గాలు, కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యాయి. అందుకే ఇచ్చింది తీసుకోవడం మినహా మరో దారి కూటమిలోని మిగిలిన పార్టీలకు ఉండదు. అలాగని కూటమి నుంచి విడిపోతే రాజకీయ నష్టం కేవలం టీడీపీకే మాత్రం జరగదు. మిగిలిన జనసేన, బీజేపీలకు కూడా జరుగుతుంది. ఆ సంగతి చంద్రబాబుకు కూడా తెలియంది కాదు. అందులోనూ సరైన నాయకత్వం లేనప్పుడు మేయర్, ఛైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగితే టీడీపీకి తప్ప మిగిలిన రెండు పార్టీలకు సరైన నాయకత్వం లేదు. నిలబడి.. పోటీ చేసే నాయకుడు ఎవరు? అన్న ప్రశ్నకు వారి నుంచి సమాధానం రాదు. అదే టీడీపీకి బలమైన నాయకులు ప్రతి నియోజకవర్గంలో ఉన్నారు. అదే తేడా. అందుకే కుదరదు అంటూ బాబు కూటమిలోని మిగిలిన పార్టీల ప్రతిపాదనలను కొట్టిపారేసే అవకాశాలే ఎక్కువ ఉన్నాయి.

# ఉద్యోగుల తిరుగుబాటు తప్పదా...

కాకినాడ, ఆగస్టు 25, ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వంపై ప్రభుత్వ ఉద్యోగులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ నెల మూడో వారం వరకూ గడువు విధించారు. ఈలోపు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపకుంటే ఉద్యమ బాట పడతామని ఉద్యోగ సంఘాల నేతలు హెచ్చరించాయి. మూడో వారంలోపు చంద్రబాబు తమను పిలిచి చర్చించి సమస్యలను పరిష్కరించేలా హామీ ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలల మూడు నెలలు కావస్తున్నప్పటికీ తమ సమస్యల పరిష్కారినికి చొరవ చూపలేదని అంటున్నారు. అందుకే తాము ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నామని తెలిపారు. పి.ఆర్.సి., డీఏ, హెల్త్ కార్డులపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమస్యలు, డిమాండ్ల విషయంలో ఏపీ జేఏసీ నాయకత్వం దృఢమైన వైఖరితో వ్యవహరించాలని నిర్ణయించింది. పి.ఆర్.సి., డీఏ, ఐఆర్ లపై సానుకూల నిర్ణయాలు కోరుతూ దశల వారీగా ఆందోళనలు చేయాలని నిర్ణయించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు పి.ఆర్.సి., డీఏ, ఐఆర్ తదితర అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఏపీ జేఏసీ నేతలు కోరుతున్నారు. అయితే మంత్రి వర్గ ఉప సంఘం పేరుతో ఇంకా కాలయాపన చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని కూడా ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. పి.ఆర్.సి., డీఏ, ఐఆర్ తదితర అంశాల పరిష్కారం సరెండర్ లీవ్, తదితర బకాయిల విడుదల ఉద్యోగుల హెల్త్ కార్డుల సమస్య పరిష్కారం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపు పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ౹ఖ నుండి మినహాయింపు అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్?1లో చేర్చాలి. సీపీఎస్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి ధరలు పెరగుతుండటంతో... పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగుల ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ క్లిష్టంగా మారుతోందని, ఉద్యోగులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఉద్యోగ సంఘ నేతలు చెబుతున్నారు. సామాన్య ఉద్యోగి కష్టాలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల ప్రయోజనాల పరిరక్షణ కోసం అవసరమైతే తగిన పోరాట కార్యాచరణ చేపట్టేందుకు ఏపీ జేఏసీ సిద్ధంగా ఉందని నాయకులు స్పష్టం చేశారు. నాయకులంతా సిద్ధంగా ఉండాలని కోరారు.ఆగస్టు చివరి వారంలో ఏపీ జేఏసీ విస్తృత రాష్ట్రస్థాయి సమావేశంలో ప్రస్తుత పరిస్థితులపై సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకన్నట్లు తెలిపారు

# తప్పు దిద్దుకోవడంపై ట్రోల్...

విశాఖపట్టణం, ఆగస్టు 25, రాజకీయాల్లో నాయకుడి పరిపక్వతకు, అభివృద్ధికి ప్రధాన పరీక్ష అతడు సవాళ్లను ఎలా ఎదుర్కొంటాడు, తన తప్పులను ఎలా స్వీకరిస్తాడనే దానిపైనే ఆధారపడి ఉంటుంది. ఏపీ మంత్రి నారా లోకేష్ ఓ స్కూల్ కార్యక్రమంలో బోర్డుపై సంఖ్య రాసేటప్పుడు 26 కు బదులుగా పొరపాటున 06 అని రాశారు. ఆ తప్పును వెంటనే గమనించిన లోకేష్, ఎలాంటి సంకోచం లేదా బిడియం లేకుండా తక్షణమే దాన్ని 26 అని దిద్దుకున్నారు. అయితే, వైఎస్సార్సీపీ సోషల్ మీడియా విభాగాలు ఆ దిద్దుకునే వీడియోను కట్ చేసి.. ట్రోల్ చేయడానికి శతవిధాలా ప్రయత్నించాయి. కానీ, ఒక నాయకుడు తన పొరపాటును తక్షణమే గుర్తించి సరిదిద్దుకోవడం అనేది బాధ్యతాయుతమైన వైఖరికి నిదర్శనమే తప్ప హేళన చేయాల్సిన అంశం కాదు.దీనికి పూర్తి భిన్నమైన వైఖరిని పూర్వ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ శైలిలో చూస్తుంటాం. ప్రెస్ మీట్లలో లేదా బహిరంగ సభల్లో జగన్ మాట్లాడే అనేక గణాంకాలు, వ్యాఖ్యలలో తీవ్రమైన పొరపాట్లు ఉంటాయని పలుమార్లు నిరూపితమైంది. అయితే, వాటిని సరిదిద్దుకునే నైజం కానీ, లేదా తాము చెప్పిన డేటా తప్పని అంగీకరించే మనస్తత్వం కానీ ఆయనలో కనిపించవు. దానికి ఉదాహరణ.. ఇటీవల ఏపీపీఎస్సీ, డీఎస్సీ ఒకటే అని వాదించడం. అది కరెక్ట్ కాదని మీడియా ప్రతినిధులు చూపినప్పుడు, తప్పును ఒప్పుకోవడానికి బదులు తాను చెప్పిందే వేదం అనే ధోరణితో ఎదురుదాడి చేయడానికే జగన్ ప్రాధాన్యత ఇచ్చారు. అదే జగన్ నైజం.నారా లోకేష్ తన రాజకీయ జీవితంలో ప్రారంభం నుంచీ అపూర్వమైన సోషల్ మీడియా దాడిని ఎదుర్కొన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో వందలాది కోట్ల రూపాయల నిధులతో ప్రత్యేక సోషల్ మీడియా సైన్యాన్ని ఏర్పాటు చేసి, లోకేష్‌ను కించపరిచేలా అనేక ట్రోలింగ్ కాంపెయిన్లు నిర్వహించారు. ఆ అసత్య ప్రచారాలకు క్రుంగిపోకుండా, తన ప్రసంగ శైలిని, క్షేత్రస్థాయి పనితీరును, యకత్వ సామర్థ్యాన్ని లోకేష్ నిరంతరం మెరుగుపరుచుకుంటూ వచ్చారు. ఫలితంగా, ఆనాడు ఎవరైతే ట్రోల్ చేశారో, వారే ఆశ్చర్యపోయేలా తన నాయకత్వ పటిమతో, నాలెడ్జ్‌తో ఒక సమర్థవంతమైన నాయకుడిగా, విద్యాశాఖ మంత్రిగా ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని , ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు.ఏ ప్రజాస్వామ్య వ్యవస్థలోనైనా తప్పు చేయడం మానవ సహజం, కానీ ఆ తప్పును గుర్తించి దిద్దుకునే గుణమే ఒక నాయకుడిని ఎత్తుకు ఎదుగునట్లు చేస్తుంది. నేను తప్పు చేయను, నేను చెప్పిందే వేదం అనుకునే అహంకారం నాయకుడిని వెనక్కి నెడితే.. తప్పును సరిదిద్దుకుని ముందుకు సాగుతాను అనే వినయం నాయకుడి ప్రాభవాన్ని పెంచుతుంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇప్పటికైనా లోకేష్ రాజకీయ ప్రయాణం నుండి పాఠాలు నేర్చుకుని, తనలోని మొండివైఖరిని పక్కనబెట్టి, పొరపాట్లను అంగీకరిస్తూ దిద్దుకునే ప్రయత్నం చేస్తేనే ఆయన రాజకీయ భవిష్యత్తుకు లేదా పార్టీ పునర్వైభవానికి కనీసం ఒక్క అడుగైనా పడే అవకాశముంటుంది.

# ఇక పచ్చటి ప్రకాశం

ఒంగోలు, ఆగస్టు 25, ఫ్లోరైడ్ రక్కసి కోరల్లో చిక్కుకుని, తీవ్ర కరవుతో అల్లాడిపోయిన పశ్చిమ ప్రకాశం నేలలకు జీవనాడి అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కల ఎట్టకేలకు సాకారమవుతోంది. మూడు దశాబ్దాల క్రితం 1996లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మళ్లీ తన చేతుల మీదుగానే తొలి దశను జాతికి అంకితం చేసే స్థాయికి తీసుకురావడం ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగ చరిత్రలో ఒక అద్భుత ఘట్టం.

ప్రకాశంతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని లక్షలాది ఎకరాలకు సాగునీరు, సుమారు 23 లక్షల మందికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సంకల్పం నేడు సంపూర్ణ వాస్తవ రూపం దాల్చింది.వెలిగొండ ప్రాజెక్టు ప్రస్థానాన్ని నిశితంగా గమనిస్తే.. చంద్రబాబు అధికారంలో ఉన్న కాలంలోనే ఈ ప్రాజెక్టు పనులు పరుగులు తీశాయి. నల్లమల అడవుల గుండా అత్యంత సంక్లిష్టమైన రెండు భారీ సొరంగాలను తవ్వి కృష్ణా జలాలను తరలించే ఈ ఇంజనీరింగ్ అద్భుతాన్ని గత పాలకులు ఖర్చు దండగ అనుకుంటూ తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఎన్నికల ముందు అరకొర పనులతో ప్రారంభోత్సవాల డ్రామాలు ఆడినప్పటికీ, క్షేత్రస్థాయిలో నీటిని నింపే పనులు మాత్రం ముందుకు సాగలేదు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టువదలని విక్రమార్కుడిలా చంద్రబాబు నిధుల కొరతను అధిగమించి, గత రెండేళ్ల కాలంలోనే రూ.2,250 కోట్లకు పైగా వెచ్చించి మొదటి దశ పనులను శరవేగంగా కొలిక్కి తెచ్చారు.

చరిత్రలో ఏ భారీ నీటిపారుదల ప్రాజెక్టులోనూ లేని విధంగా, జలాశయంలోకి నీటిని విడుదల చేయడానికి ముందే ముంపు బాధితులకు పునరావాసం, పరిహారం పూర్తి చేయడం చంద్రబాబు ప్రభుత్వ మానవీయ దృక్పథానికి నిదర్శనం. గతంలో ప్రాజెక్టులు పూర్తయినా నిర్వాసితులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే దుస్థితి ఉండేది. కానీ వెలిగొండ విషయంలో ఆ పరిస్థితి రానివ్వకుండా, ప్రాజెక్టును ప్రారంభించే సమయానికే మూడో విడత కింద రూ.250 కోట్ల పరిహారం విడుదల చేశారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 6,206 ముంపు కుటుంబాలకు రూ.768 కోట్లకు పైగా చెల్లించి, దాదాపు 85 శాతం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని పారదర్శకంగా పూర్తి చేసి బాధితుల కన్నీళ్లు తుడిచారు.

నిర్వాసితులకు న్యాయమైన నష్టపరిహారం అందించి వారిని ఆదుకోవడంతో పాటు, అటు దశాబ్దాలుగా చుక్క నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు సాగునీరు అందించే ఏర్పాట్లు చేయడంతో ఇటు నిర్వాసితులు, అటు అన్నదాతలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నల్లమల సాగర్ జలాశయం ద్వారా కరవు నేలలు సస్యశ్యామలం కాబోతుండటం ప్రాంతీయ అభివృద్ధికి నూతన ఊపునిస్తోంది. చిత్తశుద్ధి, సంకల్ప బలం ఉంటే ఎన్ని అడ్డంకులు ఎదురైనా దశాబ్దాల చిరకాల స్వప్నాన్ని సాకారం చేయవచ్చని నిరూపిస్తూ.. చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ, ప్రకాశం ప్రాంత ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు.

# సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న జగన్



విజయవాడ, ఆగస్టు 25, వైసీపీ అధినేత వైఎస్ జగన్ అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండి పెద్ద తప్పు చేస్తున్నారు. వచ్చిన అంది వచ్చిన అవకాశాన్ని కూడా మిస్ చేసుకుంటు న్నారు. బయట మీడియా సమావేశాలు పెట్టినంత మాత్రాన ఒరిగేదేంటి? అదే అసెంబ్లీలో రెండు నిమిషాలు మాట్లాడి వాకౌట్ చేసి బయటకు వస్తే ఎంతో కొంత రాజకీయ ప్రయోజనం లభించవచ్చు. అదే సమయంలో జగన్ ను వ్యక్తిగతంగా ఎవరైనా అధికార పార్టీ సభ్యులు దూషిస్తే ఆ సాకు చూపించి బహిష్కరించవచ్చు. సమయం ఇవ్వరంటూ ముందుగానే తనకు తానే నిర్ణయించుకుని అసెంబ్లి సమావేశాలను పూర్తిగా బహిష్కరించం కూడకా సక్రమం కాదు. గెలిచి అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన జగన్ కుంటిసాకులు చెబుతు తప్పించుకుంటున్నారన్న విమర్శలకు ఆయన సమాధానం చెప్పలేని పరిస్థితి ఉంది. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తే వస్తామని కండిషన్ పెట్టడం కూడా ఎవరూ హర్షించరు. శాసనసభ నియమ నిబంధనల మేరకే ప్రతిపక్ష హోదా ఇస్తారు. దీంతోపాటు తనకు సమయం ఇవ్వరని ముందునుంచే జగన్ వాదించి సభకు దూరంగా ఉండటం కూడా సరికాదు. అసెంబ్లీకి తనతో పాటు పది మంది ఎమ్మెల్యేలతో వస్తే సమయం ఇచ్చేది లేనిదీ తెలిసేది. సభకు హాజరై అప్పుడు సమయం ఇవ్వకుంటే నేరుగా అప్పుడే తనకు సభలో మాట్లాడేందుకు సమయం ఇవ్వకపోవడం వల్లనే సభకు రాలేకపోతున్నానని చెప్పుకునే వీలుంటుంది. అంతే తప్ప అసలు సభలో అడుగు పెట్టకుండానే, తనకు సమయం ఇవ్వరని జగన్ చెప్పడాన్ని కూడా ఎవరూ స్వాగతించారు. తాము 2024 ఎన్నికల్లో గెలిచి సభకు వెళ్లలేకపోతున్నామన్న బాధ వైసీపీ ఎమ్మెల్యేల్లోనూ కనపడుతుంది. చంద్రబాబు తాను సభకు హాజరు కాకపోయినా... పోనీ తాను సభకు హాజరు కాకపోతే పోనీ. మిగిలిన పది మంది ఎమ్మెల్యేలన పంపి అసెంబ్లీలో కొంత వాదన చేసి బయటకు వచ్చే వీలుంది. ఆ అవకాశాన్ని కూడా జగన్ చేజేతలా వదులుకుంటున్నారు. తనతో పాటు తన పార్టీ ఎమ్మెల్యేలు కూడా సభకు వెళ్లకూడదని గిరి గీయడం అంటే శాసించడమేనన్న వాదనకు మరింత బలం చేకూరుతుంది. జగన్ శాసనసభకు గైర్హాజరు అతి పెద్ద తప్పిదమని (బ్లండర్ మిస్టేక్) అధికార కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా, తప్పులను వివరించలేక జగన్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నారని సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ అంశాలపై సభలో సమాధానం చెప్పకుండా పారిపోతున్నారని అధికార పక్షం విమర్శిస్తోంది. ప్రజల తరపున నిలదీయాల్సిన అసెంబ్లీ వేదికను వైఎస్సార్సీపీ బహిష్కరించడం రాజకీయంగా నష్టదాయకమని విశ్లేషకులు భావిస్తున్నారు.అసెంబ్లీకి వైఎస్ జగన్ ఎందుకు దూరంగా ఉంటున్నారనే ప్రశ్నకు బహుశా ఆయన వద్దనే సమాధానం ఉండి ఉండకపోవచ్చు.

# పులివెందులలో పవన్ మార్క్...



కడప, ఆగస్టు 25, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో పులివెందుల నియోజకవర్గం ప్రజల దాహార్తి తీరనుంది. పులివెందుల, పరిసర ప్రాంతాల ప్రజల తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే మెగా వాటర్ గ్రిడ్ పథకంపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద రూ. 280 కోట్ల కేటాయింపులు చేశారు. దీంతో పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులు 96 శాతం వరకూ పూర్తయ్యాయి. నీటి శుద్ధి ప్లాంట్ పనులు తుది దశకు చేరుకున్నాయి. పులివెందుల, సింహాద్రిపురం మండలాల్లో 100 శాతం పనులు పూర్తైనట్లు అధికారులు తెలిపారు.పులివెందుల ప్రజల ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు చేపడుతున్నారు. పులివెందుల నియోజకవర్గం, పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు పనులు 96 శాతం మేరకు పూర్తైనట్లు అధికారులు తెలిపారు.ఏడు మండలాలలోని ఐదున్నర లక్షల మంది ప్రజల తాగునీటి సమస్యలను తీర్చే లక్ష్యంతో పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం ప్రారంభించారు. జల్ జీవన్ మిషన్ కింద రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. అయితే పనులు ఆశించినంత వేగంగా జరగకపోవటంతో.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పవన్ కళ్యాణ్ దీనిపై ఫోకస్ పెట్టారు. జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలో ఇలాంటి ప్రాజెక్టు పనులను ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులను ఆదేశించారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో సుమారుగా రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. 96 శాతం పనులు పూర్తి చేశారు.దీంతో ఈ పథకం ద్వారా పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కూడా పూర్తయ్యాయి. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులను పూర్తి చేశారు. 65 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి ప్లాంట్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కి.మీ గానూ 1,106 కిలోమీటర్ల మేరకు పైప్ లైన్ల నిర్మాణం పూర్తయ్యింది.ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం తుది దశకు చేరుకుందని అధికారులు వెల్లడించారు. ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలన్న పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు.. పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను ఏపీ గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా చేపడుతున్నారు.

## సీఎం విదేశీ పర్యటనకు అనుమతి రద్దు
## కారణాలు బయటపెట్టాలి

హైదరాబాద్ విదేశీ పర్యటనకు 15 రోజుల ముందు అప్లై చేయాల్సింది కేవలం 5 రోజుల ముందు ఎందుకు అప్లై చేశారపి బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో చేయకూడని కార్యక్రమాలు చేస్తున్నాడనే సమాచారంతోనే రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దు చేశామని కేంద్ర ప్రభుత్వం చెప్తుంది. అలాంటి చేయకూడని కార్యక్రమాలు ఏం చేస్తున్నారో రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని అయన అన్నారు.

చేయకూడని పనులు చేస్తున్నాడని బీజేపీ చెప్తుంది, రాజకీయ కుట్ర అని రేవంత్ రెడ్డి అంటున్నాడు. రెండు పార్టీలు కూడా రేవంత్ రెడ్డి పొలిటికల్ క్లియరెన్స్ కోసం చేసిన దరఖాస్తులను ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు.

# వైజాగ్ కు మంచి నీటి సమస్య తీరినట్టే

విశాఖపట్టణం ఆగస్టు 25, ఏపీ అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న నగరం ఏది అని అడిగితే విశాఖ అనే చెప్తారు. భవిష్యత్‌లో వైజాగ్‌కు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ వెయ్యి కోట్లు ఖర్చు చేయనుంది. గోదావరి నుంచి నేరుగా నగరానికి తాగునీరు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇదే విషయాన్ని మంత్రి నారాయణ కూడా స్పష్టం చేశారు. ఇప్పటికే టెండర్లు పిలిచిన ప్రభుత్వం అతి త్వరగానే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి విశాఖ వాసుల తాగునీటి కష్టాలు తీర్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది.విశాఖపట్టణం ప్రజలకు ఇది శుభవార్తే అని చెప్పొచ్చు. నీటి కష్టాలతో ఇబ్బంది పడుతున్న విశాఖ నగరానికి ఉపశమనం కలిగించే వార్తను రాష్ట్ర ప్రభుత్వం అందించింది. గోదావరి జలాలను నగరానికి తరలించడంతో పాటు నగరంలో నీటి సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు రూ. వెయ్యి కోట్లతో ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేసింది. మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమల అవసరాలను తీర్చేందుకు మరో రూ. 1,500 కోట్లతో ఎస్‌టీపీల నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ప్రకటించారుజీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం 24 లక్షల జనాభా ఉంటోంది. సెంట్రల్ పబ్లిక్ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్ ఆర్గనైజేషన్ ప్రమాణాల ప్రకారం రోజుకు 135 లీటర్ల నీటిని కచ్చితంగా సరఫరా చేయాలి. ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలోని 24 లక్షల మంది జనాభా ఉండటంతో ప్రతి రోజూ 320 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే, నగరానికి తాగునీటి సరఫరా చేసే రెండు చిన్నపాటి రిజర్వాయర్లు మాత్రమే ఉండటంతో ఏలేశ్వరం, తాటిపూడి, రైవాడ రిజర్వాయర్లతో పాటు గోదావరి నదిలో బోర్ల ద్వారా నీటిని తోడి నగరానికి సరఫరా చేస్తున్నారు. ఇన్ని చేస్తున్నా రోజుకి 180 ఎంఎల్‌డీ మించి నీటిని తరలించే అవకాశం లేకుండా పోతోంది.ప్రస్తుతం విశాఖపట్టణం మరింత అభివృద్ధి చెందుతున్న నగరంగా మారుతుంది. గూగుల్ డేటా సెంటర్ రాకతో భవిష్యత్‌లో మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు వైజాగ్‌కు వచ్చే అవకాశం ఉంది. దాంతో విశాఖకు నీటి కష్టాలు పెరిగే అవకాశం ఉంది. దాంతో రానున్న భవిష్యత్‌ను ముందుగానే అంచనా వేసి రూ. వెయ్యి కోట్లతో నగరానికి తాగునీటి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి నారాయణ ప్రకటించారు.

తమిళనాడులో పథకాలపై అసెంబ్లీలో సీఎం విజయ్ కీలక ప్రకటనపోలవరం ఎడమకాలువ ద్వారా గోదావరి నీటిని కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు తీసుకువస్తారు. అక్కడ నుంచి పైప్‌లైన్ ద్వారా మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌ను నింపుతారు. అకకడ నుంచి ముడసర్లోవలో కొత్తగా నిర్మించే ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు.. పైప్‌లైన్ ద్వారా మధురవాడ పరిసర ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే రూ. 570 కోట్లతో మధురవాడ ప్రాంతంలో తాగునీటి సరఫరా నెట్‌వర్క్‌కు టెండర్ పిలవగా, మరో రూ. 110 కోట్లతో స్కాడా ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించనున్నారు.

# 7 నుంచి అసెంబ్లీ

హైదరాబాద్, ఆగస్టు 25 : తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల సమయంలో ఈ సమావేశాలు నిర్వహించనుండటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తొలి రోజు సమావేశం అనంతరం స్పీకర్ నేతృత్వంలో జరిగే శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ భేటీలో ఉభయ సభలను ఎన్ని రోజుల పాటు నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ ప్రభుత్వం పలు కీలక బిల్లులు, విధానపరమైన నిర్ణయాలను సభ ముందు ఉంచే అవకాశం ఉందని తెలుస్తోంది.మరోవైపు, ప్రజా సమస్యలు, హామీల అమలు, భూముల వివాదంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసేందుకు బీఆర్ఎస్, బీజేపీ పక్షాలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్న రిజిస్ట్రేషన్ల చట్టంలోని వివాదాస్పద 22 ఏ నిషేధిత భూముల అంశంపై చర్చ జరుగుతుందా అని ఆసక్తి నెలకొంది. రైతులకు ప్రాజెక్టుల నుంచి సాగునీటిని సకాలంలో విడుదల చేయకపోవడం, కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చేసినవి ఆరోపణలేనని నిలదీసేందుకు కేటీఆర్, హరీష్ రావు టీం ప్లాన్ చేయనుంది. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, పాలిటెక్నిక్ కాలేజీల సమస్యలు, సభలో నిలదీసేందుకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల విదేశాలకు వెళ్లగా యూకే పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, అమెరికా పర్యటనకు మాత్రం కొర్రీలు పెట్టడాన్ని తప్పుపట్టారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. విద్య, క్రీడా రంగాలకు సంబంధించి పెట్టుబడులు, అంతర్జాతీయ సహకారం ఆకర్షించడమే లక్ష్యంగా విదేశీ పర్యటన కోసం విదేశాంగ శాఖకు ముందే పూర్తి వివరాలు సమర్పించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చినప్పటికీ, దురదృష్టవశాత్తూ అమెరికా పర్యటనకు మాత్రం నిరాకరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గుజరాత్ సీఎంకు విదేశీ పర్యటనలు, రోడ్ షోలకు సులభంగా అనుమతులు ఇచ్చి, తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. "కేంద్రం భౌతికంగా నన్ను అడ్డుకోగలదు, కానీ నా ఆలోచనలను, తెలంగాణ అభివృద్ధి ఆకాంక్షలను కాదనలేదు" అని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం తన వ్యక్తిగత అవమానం కాదని, 4 కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయమని పేర్కొన్నారు. కేంద్ర వైఖరిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పలువురు సీనియర్ నేతలు తీవ్రంగా ఖండించారని గుర్తుచేశారు.రైజింగ్ తెలంగాణ 2047 ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా పెట్టుకుంటే, కేంద్రంలోని బీజేపీ నేతలు విచక్షణ మరిచిపోయి ఈ అధికారిక పర్యటనపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ విభేదాలు ఎలా ఉన్నా, రెండు ప్రభుత్వాలు మరియు ప్రజాప్రతినిధుల మధ్య ఫెడరల్ సత్సంబంధాలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# మెయినాబాద్ లో రహస్యభేటీ...

హైదరాబాద్, ఆగస్టు 25, లండన్ పర్యటన ముగించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చారు.శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. సాయంత్రం రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించబోతున్నారు. ఈ సమావేశంలో రేవంత్ ఏం మాట్లాడబోతున్నారనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. సురేఖ వ్యవహారం, అమెరికా వెళ్లడానికి కేంద్ర విదేశాంగ శాఖ మోకాలడ్డటం వంటి పరిణామాలపై రేవంత్ రెడ్డి ఎలా మాట్లాడతరనేది ఆసక్తికరంగా మారింది. రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశానికంటే ముందే తెలంగాణ రాజకీయాలలో సంచలన పరిణామాలు చోటు చేసుకుందని వార్తలు వినిపిస్తున్నాయి.గులాబీ పార్టీకి అనుకూలంగా ఉండే కొన్ని సోషల్ మీడియా గ్రూపులు.. ముఖ్యంగా ఎక్స్ హ్యాండిల్స్ లో రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. అందులో ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 20 మంది ఎమ్మెల్యేలతో ప్రచారం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత రాజకీయాలు జరుగుతున్నాయ.. ఇవి చర్చనీయాశంగా మారిపోయారని.. మొయినాబాదులోని ఒక వ్యవసాయ క్షేత్రంలో రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో సుమారు 20 మంది ఎమ్మెల్యేలు రహస్యంగా సమావేశం అయ్యారని ప్రచారంలో ఉంది.ఈ సమావేశంలో ఆ 20 మంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలి మీద.. ముఖ్యంగా కొంతమంది వ్యక్తులు సాగిస్తున్న ఆధిపత్యం మీద తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రచారం జరుగుతుంది. అవసరమైతే ప్రభుత్వం ఇబ్బందుల్లో పడినప్పటికీ.. తమ ధోరణి మార్చుకునే అవకాశం లేదని వారు చెప్పినట్టు గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులలో ప్రచారం జరుగుతోంది.మొయినాబాద్ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఈ సమావేశానికి కొంతమంది సీనియర్ మంత్రులు సపోర్ట్ చేసినట్టు తెలుస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రి.. ముఖ్యమంత్రి సొంత జిల్లా చెందిన ఒక మంత్రి.. రంగారెడ్డి.. నల్గొండ జిల్లాలకు చెందిన కొంతమంది సీనియర్ ఎమ్మెల్యేలు.. ఉమ్మడి పాలమూరు జిల్లా చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు ఇందులో పాల్గొన్నట్టు గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులలో ప్రచారం జరుగుతుంది ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 64 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. ఒకవేళ ఆ 20 మంది ఎమ్మెల్యేలు తాటి మీదికి వస్తే.. రాజకీయంగా ప్రభావం చూపించే అవకాశం ఉందని.. కెసిఆర్ ను మరోసారి ముఖ్యమంత్రి చేస్తారని గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులో సొంత డబ్బా కొట్టుకుంటున్నాయిఇక ఇటీవల రేవంత్ రెడ్డి ఫారిన్ టూర్ కు సంబంధించిన వ్యవహారాలు కూడా ఆసక్తికరంగా మారాయి. ఆయన అమెరికా టూర్ రద్దయింది. గడ్డం నుంచి నేరుగా ఆయన హైదరాబాద్ వచ్చారు. దీనిపై రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. సరే గవర్నమెంట్ పర్మిషన్ ఇవ్వకపోవడంతో ఆయన టూర్లో ఆకస్మికంగా మార్పులు జరిగాయి. అయితే కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత పరిణామాలు కూడా దీనికి కారణమని గులాబీ పార్టీ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.కొంతకాలంగా క్యాబినెట్ విస్తరణ కూడా వాయిదా పడుతూ వస్తోంది. మినిస్టర్ పదవులు ఆశిస్తున్న కొంతమంది సీనియర్ లీడర్లు తీవ్రమైన అసంతృప్తిలో ఉన్నారు. మొయినాబాద్ వ్యవసాయ క్షేత్రంలో జరుగుతున్న సమావేశం లో నిజం ఎంత.. దీని వెనక గులాబీ పార్టీ సోషల్ మీడియా ఎందుకు ఈ స్థాయిలో ప్రచారం చేస్తోంది.. రాజగోపాల్ రెడ్డి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారా.. అనే విషయాలపై క్లారిటీ రావాలంటే కాస్త సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

## భారీ అయుధాలు స్వాధీనం

రాయ్ పూర్ ఛత్తీస్గఢ్లో భద్రతా బలగాలు సోమవారం రాత్రి భారీగా నక్సల్స్ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. భేజీ పోలీస్ స్టేషన్ పరిధిలోని భండార్పదర్, మునుర్గొండ అటవీ ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో ఎస్ఎల్ఆర్ రైఫిల్, 315 బోర్ తుపాకీ, మస్కెట్ రైఫిల్, బీజీఎల్ లాంచర్, గ్రెనేడ్లు, ఇతర సామగ్రిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. ఆయుధాల స్వాధీనం నేపథ్యంలో అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు మరింత విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి.

# రామ్ మాధవ్ రీ ఎంట్రీ...

# ఫేట్ మారుస్తారా

హైదరాబాద్, ఆగస్టు 25, దేశంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీజేపీలోకి ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న రామ్ మాధవ్ ఎంట్రీ ఇచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఆయన స్కెచ్ వేసేందుకే కొత్త బాధ్యతలను రామ్ మాధవ్ కు అప్పగించినట్లు అర్థమవుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆధ్వర్యంలో పార్టీ కొత్త జాతీయ జట్టులో రామ్ మాధవ్ ను జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించారు. దాదాపు ఆరేళ్ల తర్వాత పార్టీ ప్రధాన జట్టులోకి ఎంట్రీ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. రామ్ మాధవ్ ఆర్ఎస్ఎఎస్ నేపథ్యం ఉన్న వ్యక్తి కావడం, ఇటీవల జెన్ జీ ఆందోళనలు, బీహార్ ఉప ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన పార్టీలో ప్రవేశం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. జాతీయ రామ్‌మాధవ్‌కు మళ్లీ కీలక స్థానం దక్కడం, ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న పలువురు నేతలు తమ పదవుల్లో కొనసాగడం ఈ జట్టు ప్రత్యేకత అని మరొకటిగా చెప్పుకోవాలి. రామ్‌మాధవ్ కు దేశంలోని అన్ని ప్రాంతాలపై లోతైన అవగాహన ఉంది. ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితుల్లో రామ్ మాధవ్ ను బీజేపీలోకి తీసుకోవడం ఆ పార్టీని బలోపేతం చేయడమే కాకుండా ఒకరకంగా రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలలో విజయం సాధించడంతో పాటు వచ్చే లోక్ సభ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయడం కూడా రామ్‌మాధవ్ పై బాధ్యతను పెట్టినట్లు సమాచారం. ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ప్రారంభించిన రామ్‌మాధవ్ ఆర్ఎస్ఎస్ జాతీయ అధికార ప్రతినిధిగా, అఖిల భారత సహ ప్రచార ప్రముఖ్‌గా పనిచేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన తర్వాత పార్టీ సంస్థాగత వ్యవహారాల కోసం ఆర్ఎస్ఎస్ ఆయనను బీజేపీకి పంపింది. ఆ సమయంలో ఆయనను జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఆ ఎన్నికల్లో బీజేపీని దేశంలో అధికారంలోకి తేవడంలో రామ్‌మాధవ్ కీలక భూమిక పోషించారు విషయ పరిజ్ఞానం... రామ్ మాధవ్ తూర్పుగోదావరి జిల్లా లో జన్మించారు. కాకినాడలో చదివారు. అమలాపురంలో ప్రాధమిక విద్యను మొత్తం పూర్తి చేశారు. తర్వాత కాకినాడలో పాలిటెక్నిక్ పూర్తి చేశారు. అనంతరం ఇంజినీరింగ్ ను కూడా పూర్తి చేశారు. అంతేకాదు పొలిటికల్ సైన్స్ లోనూ పట్టాను పొందారు. సమగ్రమైన అవగాహన ప్రతి అంశంపై ఉంది. జాతీయ, అంతర్జాతీయ విషయాలు, పరిణామాలపై అవగాహన ఎప్పటికప్పుడు ఏర్పరచుకుంటూ మంచి పట్టు సాధించారన్న పేరుంది. విషయ పరిజ్ఞానంతో పాటు ఆత్మవిశ్వాసంతో ఆయన ఏ విషయంపైనా మాట్లాడతారు.గతంలో ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకశ్మీర్‌లో బీజేపీ విస్తరణలో రామ్‌మాధవ్ కీలక పాత్ర పోషించారు. అసోం, త్రిపుర, నాగాలాండ్‌లో బీజేపీ ప్రభుత్వాల ఏర్పాటు, పార్టీ బలోపేతంలో రామ్ మాధవ్ భాగస్వామ్యమయ్యారు.గత లోక్ సభ ఎన్నికల్లోనే బీజేపీకి సొంతంగా సీట్లు తగ్గాయి. వరసగా దేశంలో ఆందోళనలు నేపథ్యంలో ఆయన ముందు బీజేపీని మరోసారి కేంద్రంలో అధికారంలోకి తీసుకు రావడం, ఐదు రాష్ట్రాల్లో జరిగే శాసనసభ ఎన్నికల్లో గెలిపించడం ఆయన బాధ్యత అని చెప్పాలి. మరి రామ్ మాధవ్ తనకు ఇచ్చిన టార్గెట్ ను ఏ మేరకు పూర్తి చేయగలరన్నది చూడాలి.

# నాలుగు దేశాల జీడీపీ కంటే

# ఇండియన్ బిజినెస్ మ్యాన్ ఆదాయమే ఎక్కువ

ముంబై, ఆగస్టు 25 భారత్‌లోని అత్యంత ధనిక కుటుంబాల జాబితా వెలువడింది. 2026 బార్క్లేస్ ప్రైవేట్ క్లయింట్స్ హురున్ ఇండియా మోస్ట్ వాల్యూయబుల్ ఫ్యామిలీ బిజినెస్‌లో భారత కుబేరుల జాబితా విడుదలైంది. ఈ లిస్టులో మొదటి స్థానంలో అంబానీ కుటుంబం, రెండో స్థానంలో అదానీ కుటుంబం ఉన్నాయి.ఈ జాబితా ప్రకారం, భారత్2లోని టాప్ 10 ధనిక వ్యాపార కుటుంబాల మొత్తం సంపదను కలిపితే 70.5 లక్షల కోట్లు అవుతుంది. లిస్టులోని టాప్ 300 కుటుంబాల మొత్తం సంపద విలువ 138 లక్షల కోట్ల రూపాయలు. ఇందులో ఒక్క అంబానీ కుటుంబం వద్దే 25.8 లక్షల కోట్ల రూపాయల ఆస్తి ఉంది. రెండో స్థానంలో గౌతమ్ అదానీ ఉన్నారు. వారి సంపద విలువ 19.6 లక్షల కోట్ల రూపాయలు. 138 లక్షల కోట్ల మొత్తాన్ని ఒక దేశ జీడీపీగా పరిగణిస్తే, అది ప్రపంచంలో 18వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుంది. ఈ సంపద సౌదీ అరేబియా, స్విట్జర్లాండ్, పోలాండ్, నెదర్లాండ్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాల మొత్తం జీడీపీ కంటే ఎక్కువ.2025-26 ఆర్థిక సంవత్సరానికి భారతదేశ నామమాత్ర జీడీపీ 3.92 ట్రిలియన్ అమెరికన్ డాలర్లు (సుమారు 328 లక్షల కోట్లు)గా ఉంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి ఏప్రిల్ 2026 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' నివేదిక ఆధారంగా ప్రభుత్వం 2026 ఆగస్టులో ఈ సమాచారం ఇచ్చింది. ఈ విలువతో భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. 138 లక్షల కోట్ల రూపాయల మొత్తం ద్వారా అనేక పెద్ద మైలురాళ్లను సాధించవచ్చు. ఈ భారీ మొత్తంతో ఒక్కో నగరానికి 30 వేల కోట్ల రూపాయల చొప్పున 100 కొత్త స్మార్ట్ సిటీస్ నిర్మించవచ్చు. వీటిలో 100 శాతం అండర్‌గ్రౌండ్ విద్యుత్- వాటర్ పైప్ లైన్లు, ఏఐ పవర్డ్ ట్రాఫిక్ కంట్రోల్, మోడ్రన్ డ్రైనేజ్ సిస్టమ్ ఉంటాయి.

ఒక్కో ఆసుపత్రికి రూ. 500 కోట్ల ఖర్చుతో ఢిల్లీ ఎయిమ్స్ తరహాలో అత్యాధునిక సౌకర్యాలతో 5000 భారీ ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మించవచ్చు.

ఒక్కో స్కూలుకు 20 కోట్ల రూపాయల ఖర్చుతో 50000 హైటెక్ పాఠశాలలు నిర్మించవచ్చు. అందులో అత్యుత్తమ అంతర్జాతీయ స్థాయి సైన్స్, రోబోటిక్స్ ల్యాబ్స్, డిజిటల్ స్మార్ట్ క్లాస్‌రూమ్స్, పెద్ద ప్లేగ్రౌండ్లు వంటి అనేక సౌకర్యాలు కల్పించవచ్చు.

38 లక్షల కోట్ల రూపాయలతో ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వే తరహాలో 25000 కిలోమీటర్ల ఎక్స్‌ప్రెస్‌వేలు వేయవచ్చు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, గుజరాత్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు దేశంలోని ప్రతి ప్రధాన ఆర్థిక కేంద్రాన్ని కలుపుతుంది. దీని వల్ల లాజిస్టిక్స్ రెండింతల వేగంతో జరుగుతుంది.

ఈ మొత్తాన్ని భారత మొత్తం జనాభాలో (సుమారు 140 కోట్ల మంది) సమానంగా పంచితే, దేశంలో ప్రతి వ్యక్తి బ్యాంక్ ఖాతాలో 1 లక్ష రూపాయలు ఉంటాయి.

ముకేష్ అంబానీ ఇల్లు యాంటిలియా ప్రపంచంలో అత్యంత ఖరీదైన ఇళ్లలో ఒకటి. ఈ డబ్బుతో యాంటిలియా వంటి 10000 లగ్జరీ ఇళ్లు నిర్మించవచ్చు.

ఈ భారీ మొత్తంతో 7000 రఫేల్ జెట్లు కొనుగోలు చేయవచ్చు.

ప్రపంచంలో అతిపెద్ద బంగారు నిల్వలు అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వద్ద ఉండగా.. ఈ డబ్బుతో అంతర్జాతీయ మార్కెట్ నుంచి లక్షల కిలోల బంగారం కొనుగోలు చేయవచ్చు.

హురున్ ఇండియా రిపోర్ట్ ప్రకారం, భారత్‌లోని అత్యంత ధనిక వ్యాపార కుటుంబాల ప్రస్తుత ఆస్తుల వివరాలు ఇక్కడ అందిస్తున్నాం.

ర్యాంక్ బిజినెస్ ఫ్యామిలీ నెట్‌వర్త్ కంపెనీ

1 అంబానీ కుటుంబం రూ. 25.8 లక్షల కోట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్

2 అదానీ కుటుంబం రూ. 19.6 లక్షల కోట్లు అదానీ గ్రూప్

3 సునీల్ భారతి మిట్టల్ రూ. 12.1 లక్షల కోట్లు భారతి ఎంటర్‌ప్రైజెస్

4 కుమార్ మంగళం బిర్లా రూ. 8.14 లక్షల కోట్లు ఆదిత్య బిర్లా గ్రూప్

5 జిందాల్ కుటుంబం రూ. 8.02 లక్షల కోట్లు ఓపీ జిందాల్ గ్రూప్

అదానీ కుటుంబం, సునీల్ భారతి మిట్టల్ కుటుంబం కాకుండా దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించిన మరికొంతమంది మొదటి తరం వ్యాపార కుటుంబాలు ఉన్నాయి. దిలీప్ సంఘ్వీ కుటుంబం- రూ.4.55 లక్షల కోట్ల ఆస్తితో సన్ ఫార్మా దిలీప్ సంఘ్వీ కుటుంబం మొదటి తరం ధనవంతుల్లో మూడో స్థానంలో నిలిచింది. పూనావాలా కుటుంబం- రూ.2.98 లక్షల కోట్ల ఆస్తి విలువతో సీరం ఇన్‌స్టిట్యూట్ పూనావాలా కుటుంబం కూడా జాబితాలో చోటు దక్కించుకుంది. రాధాకిషన్ దమానీ కుటుంబం- రూ.2.86 లక్షల కోట్ల నెట్‌వర్త్‌తో అవెన్యూ సూపర్‌మార్ట్స్ వ్యవస్థాపకుడు రాధాకిషన్ దమానీ ఈ జాబితాలో ఉన్నారు.

## వరుసకు కొడుకు అయిన యువకుడితో వివాహేతర సంబంధం.. భర్తను హతమార్చిన భార్య

యాదాద్రి భువనగిరి చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలో రాపోలు దానయ్య (36), శారద అనే దంపతులు 15 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకుని, ముగ్గురు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. భార్య శారద తన సోదరుడి కొడుకు శివ(19)తో శారద వివాహేతర సంబంధం పెట్టుకుందని తెలిసి దానయ్య వారిని మందలించాడు. ఈ నెల 23వ తేదీన భర్తతో పొలానికి వెళ్లి, మలవిసర్జనకు వెళ్తానని చెప్పి, అప్పటికే అక్కడ పొదల్లో ఉన్న శివ వద్దకు శారద వెళ్లింది. శారద ఎంతకూ తిరిగి రాకపోవడంతో చెట్ల పొదల్లో వెతకగా.. శివ, శారద సన్నిహితంగా ఉండడం చూసి కోపంతో పక్కనే ఉన్న కర్రతో వాళ్లను కొట్టేందుకు దానయ్య ప్రయత్నించాడు. దీంతో ఆ కర్రను శివ లాక్కుని దానయ్య తలపై బలంగా కొట్టాడు. పారిపోతున్న దానయ్యను శివ రాయితో కొట్టడంతో అతను కిందపడిపోగా, శారద అతని కాళ్లను గట్టిగా పట్టుకుంది. వెంటనే పెద్ద బండరాయితో తలపై శివ గట్టిగా కొట్టడంతో దానయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తరువాత మీ అన్న కనిపించడం లేదని దానయ్య తమ్ముడు శ్రీనుకు శారద ఫోన్ చేసి చెప్పింది. అక్కడికి వచ్చిన శ్రీను విగతజీవిగా ఉన్న దానయ్యను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అనుమానంతో శారదను అదుపులోకి తీసుకుని విచారించగా, శివతో కలిసి తానే హత్య చేసినట్లు నిందితురాలు అంగీకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసారు.

# గ్రూప్ తగాదాలు కు ఫుల్ స్టాప్ పడినట్టేనా

## ఇంట్లో ఈగల మోత...

హైదరాబాద్, ఆగస్టు 25, లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విమానాశ్రయం నుంచే అసలైన రాజకీయ సవాళ్లు స్వాగతం పలకనున్నాయి. ప్రభుత్వం సజావుగా సాగుతోందనుకుంటున్న తరుణంలో.. సొంత పార్టీకి చెందిన సీనియర్ మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబంపైనే గురిపెట్టి సంచలన ఆరోపణలు చేయడం అధికార కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఇప్పటికే పీసీసీ డిసిప్లినరీ కమిటీ ద్వారా షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ, రేవంత్ రెడ్డి నేరుగా నగరంలో అడుగుపెట్టిన తర్వాత తీసుకోవాల్సిన నిర్ణయం అత్యంత కఠినమైనదిగానూ, పార్టీ భవిష్యత్తును శాసించేదిగానూ మారనుంది.కొండా సురేఖ వ్యవహారాన్ని తేల్చడం అందరూ అనుకుంటున్నట్లు రేవంత్ రెడ్డికి అంత తేలికైన విషయమేమీ కాదు. కొండా కుటుంబం ఈ వివాదంలో మొదటి నుంచీ బీసీ కార్డు ను బలంగా ప్రయోగిస్తోంది. సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని మెజారిటీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నప్పటికీ, బీసీ వర్గానికి చెందిన ఒక మహిళా మంత్రిపై వేటు వేస్తే.. అది ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలకు పెద్ద రాజకీయ ఆయుధంగా మారే ప్రమాదం ఉంది. పైగా సురేఖను తొలగిస్తే తప్పనిసరిగా తక్షణమే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ చేపట్టాల్సి వస్తుంది. ప్యాక్ అయిన మంత్రివర్గంలో ఇప్పటికే పదవుల కోసం తీవ్ర పోటీ పడుతున్న అనేకమంది సీనియర్ నాయతెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించడం పైకి ఎదురుదెబ్బగా కనిపించినప్పటికీ, వ్యూహాత్మకంగా ఆయన రాజకీయ పరిస్థితుల్ని చక్కదిద్దుకోవడానికి లభించిన సువర్ణావకాశంగా కనిపిస్తోంది. సుమారు పది రోజుల పాటు సాగే సుదీర్ఘ విదేశీ పర్యటనలో భాగంగా సీఎం హైదరాబాద్‌ను వీడగానే రాష్ట్ర కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దూరంగా ఉన్న సమయంలో తలెత్తిన సంక్షోభం మరింత ముదరకుండా ఉండాలంటే ఆయన రాష్ట్రంలో ఉండటం అత్యవసరమైంది. ఈ పరిస్థితుల్లో కేంద్రం తీసుకున్న నిర్ణయం ఆయన వెంటనే స్వదేశానికి తిరిగి వచ్చేందుకు ఒక బలమైన రాజకీయ కారణాన్ని సమకూర్చింది.కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అసంతృప్తి స్వరం వినిపించడం, కొంతమంది ఎమ్మెల్యేలతో ప్రత్యేక మంతనాలు సాగిస్తున్నారనే ప్రచారం తెరపైకి రావడం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. సరిగ్గా ఇదే సమయంలో వరంగల్ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. మంత్రి వ్యాఖ్యలపై దాదాపు 20 మందికి పైగా శాసనసభ్యులు తిరుగుబాటు జెండా ఎగరేయడం, సీఎల్పీ వేదికగా మంత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడంతో సంక్షోభం తారాస్థాయికి చేరింది. సీఎం స్వయంగా క్షేత్రస్థాయిలో లేకపోతే ఈ గ్రూపు రాజకీయాలు పార్టీ ఉనికికే చేటు తెచ్చే ప్రమాదం ఏర్పడింది.పర్యటన మధ్యలోనే ఆపేసి వస్తే రాష్ట్రంలో తిరుగుబాటుకు భయపడి రేవంత్ పర్యటన రద్దు చేసుకున్నారు అనే ప్రతిపక్షాల విమర్శలను కేంద్రం తీసుకున్న నిర్ణయం పూర్తిగా తుడిచిపెట్టేసింది. విదేశాంగ శాఖ క్లియరెన్స్ నిరాకరించడాన్ని సీఎంవో సమర్థవంతంగా తమ అనుకూల అంశంగా మలుచుకుంది. వైద్యుణ్యాభివృద్ధి, పెట్టుబడుల కోసం వెళ్తున్న ముఖ్యమంత్రిని కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఉద్దేశపూర్వకంగా అడ్డుకుందనే వాదనను తెరపైకి తెచ్చి ప్రజల్లో సానుభూతిని, తెలంగాణ హక్కుల పోరాట భావజాలాన్ని బలంగా వినిపించేందుకు రేవంత్‌కు వీలు చిక్కింది. ఇది ఆయన వైపు నుంచి బలమైన రాజకీయ రక్షణ కవచంగా మారింది.లండన్‌లో ఉన్న సమయంలోనే రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తన వ్యూహాలకు పదును పెట్టారు. అసంతృప్త నేతలను దారికి తెచ్చేందుకు, గ్రూపు తగాదాలకు చెక్ పెట్టేందుకు హైకమాండ్ సహకారంతో పూర్తి కార్యాచరణను సిద్ధం చేసుకున్నారు. ఒకవైపు సొంత పార్టీలో క్రమశిక్షణను పునరుద్ధరించడం, మరోవైపు కేంద్రంపై రాజకీయ దాడిని ఉధృతం చేయడం అనే ద్వంద్వ వ్యూహాన్ని రేవంత్ ఖరారు చేశారు. ఢిల్లీ లేదా రాష్ట్ర స్థాయిలో తన నాయకత్వానికి ఎదురులేదని నిరూపించుకునేందుకు ఈ పరిణామాలను ఒక అవకాశంగా మార్చుకున్నారు. అమెరికా పర్యటన యథావిధిగా కొనసాగి ఉంటే హైదరాబాద్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం మరింత విస్తరించి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారేది. ఆ రకంగా కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడం అనేది రేవంత్ రెడ్డికి రాజకీయ నష్టం కలిగించకపోగా, తన అంతర్గత వ్యతిరేకులను కట్టడి చేసి ప్రభుత్వాన్ని, పార్టీని పూర్తి నియంత్రణలోకి తెచ్చుకోవడానికి మార్గాన్ని సుగమం చేసింది. కలం కలిసి రావడం అంటే ఇదే అనుకోవచ్చేమో.అలాగని ఈ వ్యవహారాన్ని నర్మగర్భంగా వదిలేసి, ఉపేక్షిస్తే వచ్చే నష్టం ఇంకా తీవ్రంగా ఉంటుంది. రేవంత్ రెడ్డి ఉదారంగా ఉంటే.. పార్టీలో క్రమశిక్షణ పూర్తిగా తప్పుతుందనే సంకేతాలు వెళ్తాయి. సురేఖ కుమార్తె సీఎం కుటుంబంపై చేసిన ల్యాండ్ డీల్ ఆరోపణలు, షెల్ కంపెనీల వ్యాఖ్యలను ఉపేక్షిస్తే, భవిష్యత్తులో మరికొందరు అసమ్మతి నాయకులు సైతం రేవంత్ కుటుంబంపై బహిరంగంగా రాళ్లు వేయడానికి వెనుకాడరు. నైతిక స్థైర్యాన్ని కమాండ్‌ను కాపాడుకోవాలంటే కఠిన చర్యలు తప్పవనే ఒత్తిడి పార్టీ హైకమాండ్ , మంత్రివర్గ సహచరుల నుంచి రేవంత్ పై తీవ్రంగా ఉంది.ఇక్కడే రేవంత్ రెడ్డి అత్యంత క్లిష్టమైన లీడర్‌షిప్ టెస్ట్ ను ఎదుర్కొంటున్నారు. కేవలం క్రమశిక్షణ చర్యలతో సరిపెడతారా లేదా మంత్రివర్గం నుంచే సాగనంపి తన అధికారాన్ని, ఆధిపత్యాన్ని చాటుకుంటారా అన్నది ఉత్కంఠగా మారింది. రాబోయే మూడు, నాలుగు రోజుల్లో రేవంత్ రెడ్డి తీసుకొనే సంచలనాత్మక నిర్ణయాలే.. తెలంగాణ కాంగ్రెస్‌లో అసమ్మతిని అణచివేస్తాయా లేక కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు దారితీసి కొత్త సమీకరణాలకు తెరతీస్తాయా అనేది తేలనుంది. లండన్ నుంచి వచ్చిన రేవంత్ చూపే పొలిటికల్ మార్క్ తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు హాట్ టాపిక్.

# కొండాకు రేవంత్ షాక్...

వరంగల్, ఆగస్టు 25, మంత్రి కొండా సురేఖకు సంబంధించిన రాష్ట్రంలో పరిణామాలు తీవ్ర ఆసక్తిని రేపుతున్నాయి. కొండా సురేఖకు చెందిన పర్యావరణ, అటవీ శాఖలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న అధికారుల డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలుస్తోంది. వారు పీసీసీఎఫ్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ నిర్ణయం మంత్రి కొండా సురేఖకు ముందస్తు సమాచారం లేకుండానే జరిగిందన్న ప్రచారం ఇప్పుడు సచివాలయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే మంత్రి కొండా సురేఖ వివాదం.. అటు ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేపుతున్నవేళ.. మరో ఘటన జరిగింది. రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు సంబంధించిన శాఖలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అటవీ శాఖలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న పలువురు అధికారులు, ఉన్నతాధికారుల డిప్యూటేషన్లను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే మంత్రి కొండా సురేఖకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ నిర్ణయం జరిగిందన్న ప్రచారం ఇప్పుడు ప్రభుత్వ వర్గాల్లో చర్చకు దారితీసింది.డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న అధికారులు వెంటనే పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్) కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించినట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయం వెనుక పరిపాలనా కారణాలే ఉన్నాయా లేక ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలతో దీనికి ఏమైనా సంబంధం ఉందా అనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో మొదలైంది.అటవీ శాఖలో వివిధ బాధ్యతల్లో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న పలువురు ఐఎఫ్ఎస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారుల డిప్యూటేషన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఆయా శాఖకు సంబంధించిన కీలక పరిపాలనా నిర్ణయాలు సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లడం ఆనవాయితీగా ఉంటుంది. అయితే.. తాజాగా అధికారుల డిప్యూటేషన్ రద్దు వ్యవహారంలో మంత్రి కొండా సురేఖకు ముందుగా సమాచారం ఇవ్వలేదన్న ప్రచారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.అయితే అటవీ శాఖలో అధికారుల డిప్యూటేషన్లను ఎందుకు రద్దు చేశారు.. ఏయే అధికారులను వెనక్కి పంపిస్తున్నారు.. అటవీ శాఖలో తదుపరి ఎలాంటి మార్పులు ఉండబోతున్నాయి అనే అంశాలపై అధికార వర్గాల్లో ముమ్మరంగా చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ నిర్ణయాన్ని పరిపాలనా చర్యల్లో భాగంగానే తీసుకున్నదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది.మరోవైపు.. తన విదేశీ పర్యటన తర్వాత తాజాగా మీడియా సమావేశం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితకు సంబంధించిన వివాదంపైస్పందించారు. ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పార్టీ అంతర్గత అంశాలపై తాను బహిరంగంగా మాట్లాడబోనని పేర్కొన్నారు. అధిష్ఠానం లేదా క్రమశిక్షణ కమిటీ తీసుకునే నిర్ణయాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.ఒకవైపు కొండా సురేఖ వ్యవహారంపై పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిశీలన కొనసాగుతుండగా..మరోవైపు ఆమె నిర్వహిస్తున్న అటవీ శాఖలో డిప్యూటేషన్ల రద్దు కావడం రాజకీయంగా తీవ్ర ఆసక్తిని పెంచింది. ఈ రెండు పరిణామాలు ఒకే సమయంలో చోటుచేసుకోవడంతో తెలంగాణ కాంగ్రెస్‌లో దీనిపై విస్తృత చర్చ జరుగుతోంది. అయితే డిప్యూటేషన్ల రద్దు నిర్ణయాన్ని కొండా సురేఖ వ్యవహారంతో ముడిపెట్టడానికి అధికారికంగా ఎలాంటి ఆధారాలు కనిపించడం లేదు. పరిపాలనా అవసరాల నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

# శ్రీశైలంలో తీవ్ర విషాదం

### వడ్డెర సత్రంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య



శ్రీశైలం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలోని వడ్డెర సత్రంలో శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లికి చెందిన ఒకే కుటుంబంలోని ఐదుగురు వ్యక్తులు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు.గత నెల 28న శ్రీశైలం చేరుకున్న ఈ కుటుంబం సత్రంలోని గదిలో బస చేస్తోంది.వీరిలో ఇద్దరు పురుషులు గదిలోని హాలులో ఫ్యాన్కు ఉరేసుకోగా ముగ్గురు మహిళలు స్నానాల గదిలో (బాత్రూమ్లో)ఆత్మహత్య చేసుకున్నారు. దాదాపు రెండు రోజుల క్రితమే జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.సత్రం గదినుంచి తీవ్రమైన దుర్వాసన రావడంతో నిర్వాహకులు స్థానికులు పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారు.ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డీఎస్పీ రామాంజనేయులు పరిస్థితిని సమీక్షించారు.మృతులను పల్లపు సుధాకర్ (36)ఆదిలక్ష్మి (50)మల్లేశ్వరి (45)శ్రీదేవి (33)మణికంఠ(15)గా గుర్తించారు.వీరంతా దాదాపు నెల రోజుల నుంచి ఇక్కడే బస చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ దారుణానికి తీవ్ర ఆర్థిక ఇబ్బందులే కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మాయ ప్రేమ గుణపాఠం...

మెదక్, ఆగస్టు 25, వయసు వేడిలో చాలామంది యువత తప్పుదారులు పడుతున్నారు. దారుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఘోరమైన పనులకు పాల్పడుతున్నారు. చివరికి వారిలో పశ్చాత్తాపం కలిగినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఆమె జీవితం కూడా అలాంటిదే. చేసిన తప్పు మామూలుది కాదు. సభ్య సమాజం ఈమె చేసిన దారుణాన్ని చూసి తలదించుకుంది. చివరికి ఏమైందో తెలియదు.. ఆమెలో ఎటువంటి బాధ ఆవహించిందో అర్థం కాలేదు. కానీ కఠినమైన నిర్ణయం తీసుకుంది.సంగారెడ్డిలో నర్సిగా పనిచేస్తూ ఉండేది సురేఖ అనే యువతి. ఈమెకు 25 సంవత్సరాలు. కుటుంబం పరంగా ఆర్థిక సమస్యలు లేవు. ఈమెకు ఒక సోదరుడు ఉన్నారు. ఈ క్రమంలో సురేఖ ఓ యువకుడితో ప్రేమ వ్యవహారం కొనసాగించడం మొదలుపెట్టింది. అతడితోనే వివాహం జరిపించాలని కోరింది. దానికి ఆమె తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. కొద్దిరోజులు వారితో సురేఖ మాట్లాడలేదు. ఆ తర్వాత తన ప్రియుడి గురించి వారితో చర్చించడం మొదలుపెట్టింది. అయినప్పటికీ అతడితో పెళ్లికి వారు ఒప్పుకోలేదు. దీంతో సురేఖ వారి మీద ఆగ్రహం పెంచుకుంది. ప్రతిసారి తనను ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో వారిని అంతం చేయాలని భావించింది.నరిగా ఏడు నెలల క్రితం ఇంటికి వెళ్లిన సురేఖ.. తల్లిదండ్రులకు మత్తుమందు ఇచ్చింది. ఆ మత్తులోనే వారిద్దరు చనిపోయారు. ఆ తర్వాత వారిద్దరికీ గుండెపోటు వచ్చిందని కుటుంబ సభ్యులను నమ్మించే ప్రయత్నం చేసింది. మహానటి లెవెల్లో ఫెర్పార్మెన్స్ ఇచ్చింది. కానీ.. ఆమె మాట్లాడిన మాటలకు.. చెప్పిన వివరాలకు పొంతన లేకపోవడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. ప్రేమికుడితో పెళ్లి జరిపించలేదని ఆగ్రహంతోనే ఆమె ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఆమెను అరెస్ట్ చేశారు. గడిచిన ఏడు నెలలుగా ఆమె జైలు శిక్ష అనుభవించింది. ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చింది. ఈ నేపథ్యంలో సంగారెడ్డిలో ఆమె ఒక హాస్టల్లో ఉంటోంది. తన పేరెంట్స్ ను ఏ విధంగానైతే మత్తుమందు ఇచ్చి అంతం చేసిందో.. అదే తీరుగా ఆమె కూడా మత్తుమందు తనకు తాను ఇచ్చుకుని.. బలవన్మరణానికి పాల్పడింది. సురేఖ వ్యవహారం ఎంతోమందికి గుణపాఠం లాగా మారింది.వయసు వేడిలో కన్న తల్లిదండ్రులనే ఆమె మట్టుపెట్టింది. మాయదారి ప్రేమ కోసం ఏకంగా వారినే అంతం చేసింది. చివరికి తన ప్రాణాలు తాను తీసుకుంది. ఆమె తీసుకున్న నిర్ణయం వల్ల ఒక కుటుంబం మొత్తం తీరని దుఃఖంలో మునిగిపోయింది. తల్లిదండ్రులు చనిపోయి.. సోదరి కూడా ఇలా కనుమూయడంతో సురేఖ సోదరుడు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. ఇంతటి ఘోరం ఏ కుటుంబానికి రాకూడదని అతడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

# సెట్టూరు ఎస్సీ బాలుర వసతి గృహ వార్డెన్ సస్పెన్షన్

శెట్టూరు ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థి హర్షవర్ధన్‌తేజ మృతి చెందగా అందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్ ధనుంజయను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు సోషియల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వరి తెలిపారు. కలెక్టర్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారన్నారు. వసతి గృహాన్ని ఆమె సోమవారం తనిఖీ చేశారు. ప్రమాదానికి కారణమై ప్రదేశాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, వార్డెన్ అందుబాటులో ఉంటున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నిర్మించిన మరుగుదొడ్ల ఎందుకు ఇంకా ఉపయోగించడం లేదని ఆరా తీశారు. సదరు విద్యార్థులు ఎందుకు బహిర్భూమికి బయటకు వెళ్లారని అడిగి తెలుసుకున్నారు. కళ్యాణదుర్గం ఎస్సీ వసతి గృహ వార్డు సూరాంజనేయులును ఇక్కడ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారని తెలియజేశారు. కొత్తగా నిర్మించిన మరుగుదొడ్ల చిన్నపాటి పనులు పూర్తి చేయించి, ప్రహరీ గోడను నిర్మింపజేసేలా చూస్తామని చెప్పారు. వార్డెన్, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గంటల్లోనే ఇద్దరు చిన్నారుల కిడ్నాప్ కేసు ఛేదింపు

హైదరాబాద్ గచ్చిబౌలిలో ఇద్దరు చిన్నారుల కిడ్నప్ కేసు ఛేదించాం. వెస్ట్ బెంగాల్ చెందిన కిడ్నాపర్ చాకు సోరెన్ అరెస్ట్ చేసామని శేరిలింగంపల్లి జోన్ డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు.కేసు వివరాలు ఆయన మీడియాకు వెల్లడించారు. గచ్చిబౌలిలోని సుదర్శన్ నగర్ వద్ద ఓ కన్స్ట్రక్షన్ లేబర్ క్యాంప్ లో నిన్న సాయంత్రం 4 గంటలకు చిన్నారులకు చాక్లెట్స్ ఇప్పిస్తానని తీసుకెళ్లి కిడ్నాప్ చేసాడు. నాలుగు ప్రత్యేక పోలీస్ బృందాలతో గాలింపు చేపట్టాము. కిడ్నాప్ గురైన బాలికలు ఇద్దరు 4 ఏళ్ల లోపు వయస్సు వుంది. నిన్న రాత్రి నుండి అన్ని చెక్ పోస్ట్ రైల్వే స్టేషన్ అలెర్ట్ చేసాం. ఘాట్ కేసర్ పెట్రో కారు సమాచారం ఇచ్చాం. ఘట్కేసర్ రైల్వే స్టేషన్లో చిన్నారులతో కలిసి వెళుతుండగా కిడ్నాపర్ ను పట్టుకున్నామని అన్నారు.నిన్న మిడ్ నైట్ మాకు ఫిర్యాదు అందగానే 4 పోలీస్ టీమ్స్ ఫామ్ చేశాము. గంటల వ్యవధిలోనే కిడ్నప్ కేసు ను ఛేదించాం. ఇద్దరు చిన్నారులు సురక్షితంగా ఉన్నారు. కిడ్నాపర్ చాకు సోరెన్ ఇతనికి నేర చరిత్ర ఉంది. గతంలో అటెంప్ట్ మర్డర్ కేసుతోపాటు రేప్ కేసులో ఇతను అరెస్ట్ అయ్యాడు. ఇతను పై వెస్ట్ బెంగాల్లో రెండు క్రిమినల్ కేసులు ఉన్నాయి . లేబర్ క్యాంప్ లో పనిచేసే వ్యక్తే చిన్నారుల కిడ్నప్ చేసినట్లు నిర్ధారణ అయింది. నిన్న సాయంత్రం ఇద్దరూ బాలికలను చాక్లెట్ ఇప్పిస్తానని కిడ్నాప్ చేశాడు. కిడ్నాప్ చేసిన వ్యక్తి ఈ క్యాంపులోనే సెంట్రింగ్ పని చేస్తాడు. చిన్నారుల తల్లిదండ్రులు బిజీగా ఉన్న సమయంలో కిడ్నాప్ చేశాడు. విచారణలో, పశ్చిమ బెంగాల్లోని కరండిఘి పోలీస్ స్టేషన్లో నమోదైన రెండు క్రిమినల్ కేసులలో ఇతని ప్రమేయం ఉంది. ఒకటి హత్యాయత్నానికి సంబంధించినది కాగా, మరొకటి అత్యాచారానికి సంబంధించినది. పశ్చిమ బెంగాల్లోని ఇస్లాంపూర్ జైలులో ఐదు సంవత్సరాల జైలు శిక్ష అనుభవించాడు. డబ్బు సంపాదించడం కోసం చిన్నారులను కిడ్నాప్ చేసాడు. పిల్లలు అవసరం ఉన్నవారికి అమ్మడంలో ఇతని ప్రమేయం ఉంది. చిన్నారులను భిక్షాటన కోసం ఉపయోగించు కోవాలని నిందితుడు కిడ్నాప్ చేసాడు. ఇతర క్రిమినల్ కార్యకలాపాల గురించి క్షుణ్ణంగా విచారిస్తున్నారు. గతంలో ఏవైనా క్రిమినల్ కేసులలో అతని ప్రమేయం నిర్ధారించుకోవడానికి అతని పూర్వ చరిత్రను విచారణ జరుపుతున్నామని అన్నారు.

# వంశధార కాల్వలో కారు బోల్తా.. ఇద్దరు మృతి

శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం కిన్నెరవాడ సమీపంలో విషాదం జరిగింది. వంశధార ఎడమ కాల్వలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. కారు కాల్వలో పూర్తిగా మునిగిపోయింది. కారులో ఉన్న ఇద్దరు మృతి చెందారు. మృతులు సీపాన రాము (50), మెండ విశాల్ కుమార్ (26). వివాహ వేడుకకు హాజరై తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కారు డ్రైవర్ గొటివాడ నాగరాజు సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు డ్రైవర్ను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

# నందిగామలో ఆటోను ఢీకొన్న బైక్..

## ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలు

ఎన్టీఆర్ జిల్లా, నందిగామ: నందిగామ పట్టణంలోని చందర్లపాడు రోడ్డులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆటోను బైక్ ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులకు గాయాలయ్యాయి. నందిగామ నుంచి చందర్లపాడు వైపు ఉపాధ్యాయులు ఆటోలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయులను పోలీసులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

## మరో ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

## బ్రేక్ ఫాస్ట్ తిని అస్వస్థతకు గురైన 13 మంది విద్యార్థులు

ఖమ్మం వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగింది. 13 మంది విద్యార్థులు అల్పాహారం తిన్న కొద్దిసేపటికి కడుపు నొప్పి, వాంతులతో ఇబ్బంది పడ్డారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను చికిత్స నిమిత్తం సిబ్బంది ఆసుపత్రికి తరలించారు.

# సెట్టూరు విద్యార్థి మృతిపై బోర్డు చైర్మన్ ఆగ్రహం

శెట్టూరు ఎస్సీ బాలుర వసతి గృహంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి హర్షవర్ధన్‌తేజ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వరితో చరవాణిలో ఆయన మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. వసతి గృహంలో మరుగుదొడ్లు ఉన్నా బహిర్భూమికి బయటకు ఎందుకు వెళ్తున్నార?, పర్యవేక్షకులు అందుబాటులో ఉంటున్నారా, వారు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సదరు వార్డెన్‌ను సస్పెండ్ చేశామని డీడీ వివరించగా, మరణిస్తే తిరిగి ర??న్నారు. విద్యార్థుల పర్యవేక్షణపై నిర్లక్ష్యం చూపరాదని, జిల్లాలో ఉన్న అన్ని వసతి గృహాలు తనిఖీలు చేపట్టి అక్కడి పరిస్థితి తెలుసుకోవాలన్నారు. ఇబ్బందులు, అధికారుల తీరు పట్ల ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కేంద్ర ప్రభుత్వ రహ్-వీర్ పథకం.. ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేల నగదు బహుమతి: డీటీఓ శంకర్ నాయక్



మహబూబాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రహ్-వీర్ (ఉనీనీట రాజీఎజీతీతిబిజీని) పథకం గురించి జిల్లా ప్రజలు తెలుసుకోవాలని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ విజ్ఞప్తి చేశారు.రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు మొదటి గంట (ఉనీశ్రీటవని ఊనీబీతీ) ఎంతో కీలకమని, ఈ సమయంలో గాయాలపాలైన వారిని వెంటనే ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వ్యక్తిని రహ్-వీర్‌గా గుర్తిస్తారని తెలిపారు. అర్హత పొందిన రహ్-వీర్‌కు రూ.25,000 నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందజేస్తారని పేర్కొన్నారు.

పౌరులు ఏం చేయాలి?

రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు అక్కడ ఉన్నా, ప్రమాదాన్ని చూసినా పౌరులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించాలని శంకర్ నాయక్ సూచించారు. బాధితుడిని ఆస్పత్రిలో చేర్పించిన అనంతరం తమ వివరాలను ఆస్పత్రిలో ఇవ్వాలని తెలిపారు. అక్కడి నుంచి సంబంధిత ఏరియా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి, సహాయం చేసిన వ్యక్తి వివరాలతో పాటు ఏ ఆస్పత్రిలో బాధితుడిని చేర్పించారనే సమాచారాన్ని తెలియజేస్తారని పేర్కొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేసే జిల్లా స్థాయి కమిటీ ద్వారా వివరాలను పరిశీలించి, అర్హత ఉన్న రహ్-వీర్‌కు రూ.25,000 నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తారని తెలిపారు.

రహ్-వీర్ పథకం ముఖ్య ఉద్దేశం ఏమిటి?

మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 134(ఎ) ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి వారి ప్రాణాలు కాపాడిన వ్యక్తిని 'రహ్-వీర్' గా పరిగణిస్తారని తెలిపారు.రహ్-వీర్ పథకం ముఖ్య ఉద్దేశం రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే ప్రాణనష్టాన్ని తగ్గించడం, ప్రమాద సమయంలో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు సామాన్య ప్రజలను ప్రోత్సహించడం అని శంకర్ నాయక్ వివరించారు.అలాగే బాధితులకు సహాయం చేసే పౌరులకు ఎలాంటి పోలీస్ లేదా చట్టపరమైన ఇబ్బందులు లేకుండా రక్షణ కల్పించడం కూడా ఈ పథకంలోని ముఖ్య ఉద్దేశాల్లో ఒకటని తెలిపారు.సంవత్సరానికి ఐదు సార్లు అవకాశం సంవత్సరానికి ఒక వ్యక్తికి (5) సార్లు మాత్రమే రహ్-వీర్ నగదు బహుమతి, ప్రశంసా పత్రం ఇస్తారు అని శంకర్ నాయక్ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం చేసి ప్రాణాలు కాపాడాలని కోరారు.ఒక వ్యక్తి సమయానికి స్పందించి గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించడం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడటమే కాకుండా, ఒక కుటుంబాన్ని విషాదం నుంచి రక్షించినవారవుతారని ఆయన అన్నారు. రహ్-వీర్ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డీటీఓ శంకర్ నాయక్ పేర్కొన్నారు.

## అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ను అరెస్టు

సుమారు 1 కోటి 25లక్షల విలువగల 251 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, 9వేల రూపాయల నగదు,ఒక సెల్‌ఫోన్ స్వాధీనం

హనుమకొండ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దామెర పోలీసులు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న నిందితుడుని అదుపులోకి తీసుకోని విచారణ చేయగా గంజాయి కోనుగోలు, విక్రయాలకు సంబంధించి కీలక వివరాలను వెలుగులోకి వచ్చాయి.

ముదిగొండ నాగేశ్వర్ రావు, (55) తనకు వున్న నెట్‌వర్క్ ద్వారా ఒడిషా రాష్ట్రానికి చెందిన రమేష్ మరియు సుధాకర్ వద్ద తక్కువ ధరకు గంజాయి కోనుగోలు చేసి తెలంగాణ, మహరాష్ట్ర, కర్ణాటక, అంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి నిందితులు ఉర్దు, రాందాస్ శేషరావు బీరదార్ , అక్లీం, షారుఖ్ ఖాన్, షేక్ అక్బర్, నునావత్ రాజుల ద్వారా ఎక్కువ ధరకు విక్రయించినట్లుగా ప్రాధమిక విచారణలో వెల్లడైంది. పోలీసులు పట్టుబడిన నిందితుడు ఇచ్చిన సమాచారం పోలీసులు అతని ఇంటి నుండి సుమారు భారీ మొత్తంలో సుమారు 1కోటి 25లక్షల రూపాయల విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకోబడింది. దీనికి సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో పాటు పోలీసులకు పట్టు బడిన నిందితుడు నాగ్వేశ్వర్ రావు నుండి గంజాయి కోనుగోలు చేసిన మిగితా రాష్ట్రాలకు చెందిన నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయడం జరిగింది.గంజాయి స్మగ్లర్‌ను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పరకాల ఏసిపి సతీష్ బాబు, శాయంపేట సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ఆత్మకూర్ ఇన్స్‌స్పెక్టర్ సంతోష్, దామెర ఎస్.వ వీరభద్రరావు, శాయంపేట ఎస్.ఐ పరమేశ్వర్, పరకాల ఎస్.ఐ రఘుపతితో పాటు ఏఏఓ సల్మాన్ పాషా, దామెర, శాయంపేట కానిస్టేబుళ్ళను సీపీ ఎన్ శ్వేతఅభినందించారు.

## అల్వాల విద్యార్థుల చిరకాల కల సాకారం

### - ప్రత్యేక ఆర్టీసీ బస్సు ప్రారంభం

:గోనెగండ్ల మండల పరిధిలోని అల్వాల గ్రామ విద్యార్థుల చిరకాల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఉన్నత విద్య కోసం పెద్ద నెలటూరు గ్రామానికి వెళ్లే విద్యార్థులు గత కొంతకాలంగా సరైన బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఉదయం వేళ సరైన సమయానికి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు గంటల తరబడి బస్టాప్ లోనే వేచి ఉండాల్సి వచ్చేది. దీంతో పాఠశాలకు ఆలస్యంగా చేరుకోవడం, తరగతులు మిస్ అవ్వడం వంటి సమస్యలతో చదువులో వెనుకబడుతున్నారు. ఆటోలను ఆశ్రయిస్తే అధిక చార్జీల భారం తల్లిదండ్రులపై పడుతోంది.ఈ విషయాన్ని గమనించిన గ్రామ పెద్దలు, పాఠశాల యాజమాన్యం చొరవ తీసుకున్నారు. ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో అధికారులతో మాట్లాడి విద్యార్థుల ఇబ్బందులను వివరించారు. వారి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ అధికారులు అల్వాల నుండి పెద్ద నెలటూరు మీదుగా ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో అల్వాల గ్రామ విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమయానికి పాఠశాలకు వెళ్లే అవకాశం కలగడంతో ఇక చదువుపై పూర్తి దృష్టి పెట్టవచ్చని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. సహకరించిన ఆర్టీసీ అధికారులకు, గ్రామ పెద్దలకు పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

# కాంట్రాక్టర్‌గా కాదు.కూలోడిగా పనిచేసింది రైతుల కోసమే.ఎమ్మెల్యే మేఘారెడ్డి

## వనపర్తినా కూలి డబ్బులు కూడా దొబ్బుకు తిన్నా పందికొక్కులుమీరు.



కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది.కేవలం ఊ లతో కమిషన్లు దండుకొని పోయింది దిష్టిబొమ్మ ఃఖీ నాయకులు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.గత ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ నిర్మించిన ప్రధాన కాలువలకు బొక్కలు పెట్టి కేవలం ప్రాజెక్టుల పేరున జీవోలు మంజూరు చేయించి కమిషన్లు దండుకు తిన్నారే తప్ప ఏ ప్రాజెక్టు నువ్వు పూర్తిస్థాయిలో నిర్మించలేదని నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించే స్థాయికి ప్రాజెక్టును తీసుకువచ్చామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి. తెలిపారు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు రాజేశ్వర్ రెడ్డిలతో కలిసి వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి కర్నేతండా లిఫ్ట్ ఇరిగేషన్ పంపులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుత.రూ.87.53 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని 18 తండాల పరిధిలో మొత్తం 4,235 ఎకరాలకు సాగునీరు అందనుందని తెలిపారు.ఇందులో వనపర్తి జిల్లాలో 3,384 ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 851 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు.గత ప్రభుత్వ హయాంలో రూ.87 కోట్లతో జీవో తీసుకువచ్చినా, సుమారు రూ.47 కోట్లు ఖర్చు చేసి పనులను మధ్యలోనే నిలిపివేశారని ఎమ్మెల్యే తెలిపారు.మిగిలిన పనులను ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా పూర్తి చేస్తూ ఇప్పటివరకు సుమారు రూ.29 కోట్లు ఖర్చు చేసిందన్నారు. మిగిలిన పనులు, భూసేకరణ తదితర అంశాలకు అవసరమైన నిధులు సమకూర్చి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు."తవ్విన కాలువలకు బొక్కలు పెట్టిన పందికొక్కులు మీరు"కర్నె తండా లిఫ్ట్ ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలు చేస్తున్న వారిపై ఘాటుగా స్పందించారు. ప్రధాన కాలువలను నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కేవలం కాలువలకు బొక్కలు కొట్టి, కమిషన్ల కోసం జీవోలు తీసుకువచ్చినంత మాత్రాన దానిని అభివృద్ధిగా చెప్పుకోలేరని విమర్శించారు.ప్రజల కోసం, రైతుల కోసం కాంట్రాక్టర్‌గా కాదు.. అవసరమైతే కూలోడిగా కూడా పనిచేశాను. నా నియోజకవర్గ ప్రజలకు నీళ్లు అందించాలన్న లక్ష్యంతో పగలు రాత్రి కష్టపడి కాలువలు తవ్వాం. కానీ మా బిల్లులను దొబ్బుకు తిన్నది మీరు" అంటూ తీవ్రస్థాయిలో విమర్శించారు.రైతులకు నీళ్లు అందుతున్నాయన్న విషయం ప్రజలకు స్పష్టంగా తెలిసిన తర్వాత కూడా, ముందుగానే ప్రెస్‌మీట్లు పెట్టి "మేం చెబితేనే నీళ్లు వస్తున్నాయి" అన్న భావనను ప్రజల్లో కల్పించేందుకు చేస్తున్న పనికిమాలిన వ్యవహారాలు, ప్రయత్నాలు అందరికీ అర్థమవుతున్నాయని అన్నారు.ప్రాజెక్టు ప్రారంభంతో కర్నె తండా పరిధిలోని రైతుల సాగుభూములకు నీరు అందే పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు.వనపర్తి జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.2,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.కర్నె తండా ప్రాజెక్టుతో 4,235 ఎకరాలకు సాగునీరు మంత్రి కోమటిరెడ్డి.కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు అదనంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు.అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న మంత్రి, కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభంతో ఈ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.గిరిజనుల ఆకాంక్ష మేరకు ప్రాజెక్టుకు శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టా పేరు మార్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం, రాష్ట్రవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ, రోడ్ల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని మంత్రి తెలిపారు.పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని చెప్పారు.కార్యక్రమంలో రాష్ట్ర అబ్కారి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సంగ్రామ్‌సింగ్ పాటిల్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## నడిరోడ్డుపై మురుగునీరు-స్పందించని అధికారులు!!

## 10 సంవత్సరాలైనా మురుగు వెయ్యని ఘటన.

## పసి పిల్లలు రోగాల బారిన పడుతున్నారని గ్రామస్తుల ఆవేదన



సి.బెళగల్ మండల పరిధిలోని ముడుమాల గ్రామంలోని, స్థానిక ఎస్సీ కాలనీలో రోడ్లపైనే, మురుగునీరు ప్రవహిస్తున్నప్పటికీ, మండల స్థాయి అధికారులు గానీ, గ్రామస్థాయి నాయకులు గాని, ఏమాత్రం పట్టించుకోవడంలేదని,రోడ్ల పైన మురుగునీరు పారడం వలన, రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని,అంతేకాకుండా మురుగునీటిలో దోమలు ఉండడం వలన, పసి పిల్లలకు విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు వేసి పది సంవత్సరాలు అయినప్పటికీ రోడ్డు కిరువైపులా కాలువలు వేయకుండా, మురుగునీరు రోడ్లపైనే పారుతుందని, పసిపిల్లలు రోగాల బారిన పడకుండగా ఉండాలంటే? ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు కిరువైపులా మురుగు కాల్వలు వేసి రోడ్లపైన మురుగునీరు ప్రవహించకుండగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు వాపోతున్నారు.

## భారత్-రష్యా వాణిజ్యం ఈ ఏడాది పెరిగిందన్న పుతిన్

న్యూఢిల్లీ, ఆగస్టు 25 భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ సోమవారం మాస్కోలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంపిన 'వ్యక్తిగత సందేశాన్ని' ఆయన పుతిన్‌కు అందజేశారు. అయితే ఆ 'పర్సనల్ మెసేజ్'లో ఏముందన్నది ఆయన వెల్లడించలేదు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలతో పాటు అంతర్జాతీయ పరిణామాలపై ఇరువురు నేతలు లోతుగా చర్చించారు.భారత్-రష్యా మధ్య వాణిజ్యం, ఆర్థిక, శాస్త్ర సాంకేతిక, సాంస్కృతిక సహకారంపై జరిగిన 27వ అంతర్-ప్రభుత్వ కమిషన్ (ఎఖీఎఉఅ-ఇఆ) సమావేశం వివరాలను జైశంకర్, ఈ సందర్భంగా పుతిన్‌కు వివరించారు. రష్యా ఉప ప్రధాని డెనిస్ మాంటురోవ్‌తో కలిసి జైశంకర్ ఈ సమావేశానికి సంయుక్తంగా అధ్యక్షత వహించారు.

# సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు అధికారుల రాష్ట్ర స్థాయి అవగాహన కార్యక్రమం



హైద్రాబాద్ ఆగస్ట్ 25: మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు మరియు అధికారుల కోసం ఒక రోజు రాష్ట్ర స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యోగితా రాణా, ఐఏఎస్, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శిడా. నవీన్ నికోలస్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, మరియు శ్రీహరి, ఏఎస్‌పీడీ

జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్, రాష్ట్ర కోఆర్డినేటర్లు అర్జున్, శ్రీనాద్ మరియు జావేద్ హాజరయ్యారు.

రాష్ట్ర ప్రధాన కార్యాలయ కమిషనర్ వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ కార్యదర్శి వి. లక్ష్మణ్ నాయక్, జిల్లా శిక్షణ కమిషనర్ ఎన్. రత్నాకర్ హాజరయ్యారు.

# తుమ్మలపల్లి యువ నాయకుడు ప్రజా జననేత గృహప్రవేశంలో పాల్గొంటున్న తెలంగాణ శాసనసభ ప్రతి గడ్డం ప్రసాద్ కుమార్




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం తుమ్మలపల్లి గ్రామంలో ప్రజా జననేత యువ నాయకుడు పిలిస్తే పలికే మంచి నాయకత్వ లక్షణాలు ఉన్న మన్నె పాండు గృహప్రవేశానికి వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నట్టు యువ నాయకుడు మన్నే పాండు ఒక ప్రకటనలో తెలిపారు కార్యక్రమానికి ముఖ్య అతిథులు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరియు మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తు మల సురేష్ కుమార్ యాదవ్ సీనియర్ నాయకులు గూడెం రాములు యాదవ్ మరియు వివిధ గ్రామాల పెద్దలు గ్రామ సర్పంచులు నాయకులు కాంగ్రెస్ కుటుంబ సభ్యులు మా ఆహ్వానాన్ని స్వీకరించి గృహప్రవేశానికి అందరూ హాజరు కాగలరని తుమ్మలపల్లి యువ నాయకుడు పాండు తెలిపారు

# శిశువుల భద్రతపై అప్రమత్తతే రక్షణ

## (హెచ్.ప్రతాప్)

శిశువు జన్మించిన క్షణం నుంచి అతని భద్రత, గుర్తింపు, కుటుంబ సంబంధాల పరిరక్షణ సమాజం మరియు ప్రభుత్వ వ్యవస్థల ప్రాథమిక బాధ్యత. కానీ తెలంగాణలో తొమ్మిది మంది చిన్నారులను అనుమానాస్పద పరిస్థితుల్లో గుర్తించిన ఘటనపై హైకోర్టు వ్యక్తం చేసిన ఆందోళన, ఈ రక్షణ వ్యవస్థలోని కొన్ని కీలక లోపాలను వెలుగులోకి తెచ్చింది. ఇది ఒక ప్రాంతానికి లేదా ఒక ఘటనకు పరిమితమైన అంశంగా కాకుండా, పిల్లల రక్షణ వ్యవస్థ ఎంత సమర్థంగా పనిచేస్తోంది? అనే విస్తృత ప్రశ్నను ముందుకు తెస్తోంది.

ఆగస్టు 24న ఈ అంశంపై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి తో కూడిన ధర్మాసనం సూర్యాపేటలో గుర్తించిన తొమ్మిది మంది చిన్నారుల జీవ సంబంధ కుటుంబాలను గుర్తించడంలో జరిగిన జాప్యంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ చిన్నారుల వయసు రెండు నెలల నుంచి మూడు సంవత్సరాల మధ్య ఉంది. ప్రస్తుతం వారు సంరక్షణ కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలోని శిశుగృహంలో ఉన్నట్లు కోర్టుకు తెలియజేశారు.

అత్యంత ముఖ్యమైన ప్రశ్న ఇక్కడే ఉంది. గ్రామ స్థాయిలో అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది వంటి విస్తృత వ్యవస్థ ఉన్నప్పటికీ, ఒక చిన్నారి కుటుంబ నేపథ్యం, తల్లిదండ్రుల వివరాలు, సంరక్షణ పరిస్థితులను త్వరగా నిర్ధారించలేకపోవడం ఎందుకు? ఇది వ్యక్తుల వైఫల్యంగా కాకుండా సమాచార వ్యవస్థలు పరస్పరం అనుసంధానమై పనిచేస్తున్నాయా? అనే కోణంలో చూడాలి.

చిన్నారులను దత్తతకు అందుబాటులో ఉంచే ముందు వారి జీవ సంబంధ కుటుంబాన్ని గుర్తించే ప్రక్రియ అత్యంత జాగ్రత్తగా జరగాలి. ఈ కేసులో సామాజిక పరిశీలన నివేదిక పూర్తయ్యేలోపే దత్తతకు సంబంధించిన కేంద్ర పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన అంశంపైనా ధర్మాసనం ప్రశ్నలు లేవనెత్తింది.

పరిష్కారం కేవలం కేసు దర్యాప్తుతో ముగియకూడదు. గ్రామస్థాయిలో బాలల రక్షణ కమిటీలను బలోపేతం చేయడం, పుట్టిన వెంటనే గుర్తింపు నమోదు వ్యవస్థను పటిష్ఠం చేయడం, కనిపించకుండా పోయిన చిన్నారుల సమాచారాన్ని వివిధ శాఖల మధ్య తక్షణమే పంచుకోవడం అవసరం. ఆసుపత్రులు, అంగన్‌వాడీలు, పోలీసు విభాగం, బాలల సంక్షేమ కమిటీలు, రక్షణ గృహాల మధ్య ఒక సమగ్ర సమాచార వ్యవస్థ ఉంటే అనుమానాస్పద కదలికలను త్వరగా గుర్తించే అవకాశం పెరుగుతుంది.

హైకోర్టు రాష్ట్రవ్యాప్తంగా రక్షణలోకి తీసుకున్న పిల్లలు, రక్షణ గృహాల్లో ఉన్నవారు, ప్రభుత్వ ప్రాయోజిత మరియు పెంపుడు సంరక్షణ పథకాల లబ్ధిదారుల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. ఈ సమాచారం సమస్య పరిమాణాన్ని అర్థం చేసుకోవడానికి, భవిష్యత్ చర్యలకు ఉపయోగపడుతుంది.

శిశువుల రక్షణలో వేగం, ఖచ్చితత్వం రెండూ సమానంగా ముఖ్యం. ఒక చిన్నారి కుటుంబాన్ని గుర్తించడంలో ప్రతి రోజు ఆలస్యం ఒక అవకాశాన్ని కోల్పోవడమే. పిల్లల భద్రతకు బలమైన చట్టాలు మాత్రమే కాదు.. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సమన్వయంతో పనిచేసే వ్యవస్థ అవసరం. అదే ఈ ఘటన మనకు అందిస్తున్న అత్యంత ముఖ్యమైన సందేశం.

# బషర్ బగ్ పోలీస్ కమిషనర్ ఆఫీస్ లో ఇన్ వార్డు సెక్షన్ ను ఏర్పాటు చేయాలి

## హైద్రాబాద్ పోలీస్ కమిషనర్ కు శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.సుదర్శన్ విజ్ఞప్తి

హైద్రాబాద్ ఆగస్ట్ 25; ప్రజాసమస్యలో భాగంగా బషర్ బగ్ పోలీస్ కమిషనర్ ఆఫీస్ లో ఇన్ వార్డు సెక్షన్ ను ఏర్పాటు చేయాలని శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.సుదర్శన్ కలిసి విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు హైద్రాబాద్ పోలీస్ కమిషనర్ సజనర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

ప్రజాసమస్యలో భాగంగా బషర్ బగ్ పోలీస్ కమిషనర్ ఆఫీస్ లో ఇన్ వార్డు సెక్షన్ లేదని కమిషనర్ దృష్టికి తీసుకెల్లారు.

ఇన్వాడు సెక్షన్ బషీర్ బాగ్ లో కూడా లేదని తెలుసుకున్న

సజ్జనార్ సానుకూలంగా స్పందిస్తూ కంటిన్యూ చేస్తామని చెప్పి హామీ ఇచ్చినట్లు సుదర్శన్ తెలిపారు.

బంజర హిల్స్ పోలీస్ కమిషనర్ ఆఫీస్ లో



ఇన్ వార్డు సెక్షన్ ఉన్నది అంత దూరం పోవాలంటే ట్రాఫిక్ ఇబ్బందితో చాలామంది ఇబ్బంది గురవుతున్నారు ఇప్పటి నుండి బషీర్బాగ్ లో కూడా ఇన్ వార్డు సెక్షన్ ఉంటుందని హామీ ఇచ్చారు.సజ్జనారును కలిసిన వారిలో

లీగల్ సెల్ వైస్ చైర్మన్ హ్యూమన్ రైట్స్ ర్ టి ఐ నెంబర్అడ్వకేట్ ప్రకాష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## 165 రకాల సీతాకోకచిలుకలు..

## జీవవైవిధ్యం అద్భుతమంటూ అసోం సీఎం హిమంత కీలక పోస్ట్

హైదరాబాద్, ఆగస్టు 25 అసోంలోని దెహింగ్ పట్కాయ్ ప్రాంతం అరుదైన జీవవైవిధ్యానికి నిలయంగా మారిందని, ముఖ్యంగా అంతరించిపోతున్న సీతాకోకచిలుకలకు సురక్షిత ఆవాసంగా నిలుస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో మొత్తం 165 రకాల సీతాకోకచిలుక జాతులు ఉన్నాయని, వాటిలో 37 అత్యంత అరుదైన జాతులు ఉన్నాయని మంగళవారం ఆయన వెల్లడించారు.ఈ అద్భుతమైన జీవవైవిధ్యంపై సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా ముఖ్యమంత్రి స్పందించారు. 'సీతాకోకచిలుక, ఎగిరిపో...' అంటూ తన పోస్టులో పేర్కొంటూ, ఈ ప్రాంత పర్యావరణ ప్రాముఖ్యతను ఆయన కొనియాడారు. ప్రభుత్వం చేపడుతున్న పటిష్ఠ పరిరక్షణ చర్యల వల్లే అరుదైన జాతులు ఇక్కడ వృద్ధి చెందుతున్నాయని, వాటికి అనువైన, సురక్షితమైన ఆవాసం లభిస్తోందని ఆయన వివరించారుపర్యావరణ వ్యవస్థ ఆరోగ్యాన్ని సూచించే కీలక జీవులుగా సీతాకోకచిలుకలను పరిగణిస్తారు. వృక్షసంపద, వాతావరణం, సహజ ఆవాసాల స్థితిగతులపైనే వీటి జనాభా ఆధారపడి ఉంటుంది. దెహింగ్ పట్కాయ్‌లో ఇంత పెద్ద సంఖ్యలో సీతాకోకచిలుకలు మనుగడ సాగించడం అక్కడి పర్యావరణ సమతుల్యతకు నిదర్శనమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# న్యాయమైన డిమాండ్ సాధన కోసం చలో కలెక్టరేట్.

## టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు పిలుపు



**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 25 ప్రజాబలం:** ఉపాధ్యాయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ సాధన కోసం చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, రెండవ పిఆర్సీని అమలు చేయాలని, ఆరు పెండింగ్ డిఏ లను వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయ ఉద్యోగుల హెల్త్ స్కీమును పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27వ.తేదీన కలెక్టరేట్ ముందు జరిగే మహా ధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బి.రామ్ చంద్,మూడ్ పుల్లయ్య, కల్లూరు మండల అధ్యక్షుడు ఆదినారాయణ,కల్లూరు మండల కోశాధికారి కృష్ణ నాయక్,శంకర్రావు రాఘవరావు, హతీరామ్, భావ్ చంద్, సింగ్య, జరపల పుల్లయ్య, శ్రీదేవి, శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హక్కుల కోసం జీవితకాలం పోరాడిన వ్యక్తి బిందేశ్వర్ ప్రసాద్ మండల్ యాదవ్

## మండల్ జయంతి వేడుకలలో పాల్గొన్న మల్లి బాబు యాదవ్

**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 25 ప్రజాబలం:** బీసీఎస్సి ఎస్టీ వర్గాల అభ్యున్నతి కోసం, జీవితకాలం పోరాడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో 27% రిజర్వేషన్ సాధించి పెట్టిన వ్యక్తి బిందేశ్వర్ ప్రసాద్ మండల్ యాదవ్ కి గౌరవ సూచికంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారతరత్న బిరుదు ఇచ్చి, వారి జయంతిని అధికారికంగా నిర్వహించాలని, డిసిసిబి డైరెక్టర్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ డిమాండ్ చేశారు.



కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో బిందెశ్వర ప్రసాద్ మండల్ యాదవ్ 108వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ బిందెశ్వర ప్రసాదమండల్ యాదవ్ బీహార్ లోని అత్యంత ధనిక యాదవ జమీందారీ కుటుంబంలో 1918 ఆగస్టు 25న జన్మించారని, జమీందారీ కుటుంబంలో పుట్టినప్పటికీ సోషలిస్టు భావాలతో నాటి అగ్రకుల భావాలను వ్యతిరేకించి, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం, అధికార పార్టీలో ఎంపీగా ఉన్నప్పటికీ, బీసీల కోసం ప్రతిపక్ష పాత్ర పోషించి పోరాడినరని, బీహార్ రాష్ట్రానికి 7వ ముఖ్యమంత్రిగా పనిచేసి, అనేక విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారని, ఆ తర్వాత అధికార పార్టీలో కేంద్ర మంత్రిగా పనిచేసే దేశం మొత్తం నలుమూలల పర్యటించి బలహీనవర్గాలు అనుభవిస్తున్న దుస్థితి చూసి, కలత చెంది 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని నివేదిక అందజేయడం జరిగిందని తెలిపారు. 1965 లో తన నియోజకవర్గంలోని పామా అనే గ్రామంలో దళితులపై బలహీనవర్గాలపై పోలీసులు భూస్వాములు ప్రోత్సాహంతో దౌర్జన్యంగా వారిపై దాడి చేసి శారీరక చిత్ర హింసలు పెడితే, శాసనసభలో దానిపై మాట్లాడకూడదని అధికార పార్టీ విప్ జారీ చేస్తే, వెంటనే పార్టీకి రాజీనామా చేసి సొంతంగా సోషలిస్టు రాజకీయ పార్టీ పెట్టి రాజకీయాల్లో కొత్తవరవడిని తీసుకొచ్చి ప్రజల కోసం పోరాడిన మహానుభావుడు ఇచ్చిన నివేదిక ప్రకారం ఈరోజు మనం హక్కులను అనుభవిస్తూ ఉన్నామని మల్లి బాబు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీల నాయకులు పాటిబండ్ల ప్రసాద్, బాదావత్ నాగరాజు, తురక బిక్షం మధ్యాహ్నపు వెంకన్న, అయూబ్, చల్ల మల్లయ్య దేరంగుల రామారావు, మేకల లక్ష్మీనారాయణ, దుద్దుకూరి వెంకన్న, రాములు, శంకర్, దస్రు, మరియు తదితరులు పాల్గొన్నారు

## దేశవ్యతిరేక శక్తులతో మీకేం పని

హైదరాబాద్, ఆగస్టు 25 అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రంగా తప్పుబట్టారు. రేవంత్ రెడ్డి వ్యవహారశైలి రాష్ట్ర శాంతిభద్రతలకే కాకుండా దేశ భద్రతకు కూడా ముప్పుగా మారుతోందని ఆరోపించారు.విదేశీ పర్యటనల్లో రేవంత్ రెడ్డి దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలుపుతున్నారని అర్వింద్ విమర్శించారు. విదేశాల్లో దేశంపై విషం చిమ్మే వారితో మాట్లాడటం ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి ప్రమాదకరమైన వ్యక్తి అని తాను గతంలోనే చెప్పానని, ఇకపై ఆయన ప్రతి కదలిక జాతీయ భద్రతా సంస్థల పరిశీలనలో ఉంటుందని వ్యాఖ్యానించారు.మరోవైపు రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై కూడా అర్వింద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. బకాయిలను క్లియర్ చేస్తామని రాహుల్ గాంధీతో హామీ ఇప్పించినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు.

# 10 ఏండ్ల దరిద్రపు గొట్టు పాలనలో వివక్షకు గురైన పాంపాడ్ రోడ్డు

## పాంపాడ్ రోడ్డు పనులు షురూ

## ప్రజల సమస్యలే ప్రాధాన్యం అభివృద్దే లక్ష్యం

## మంత్రి దామోదర్ రాజనర్సింహ

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రత్యేక కృషితో సంగారెడ్డి జిల్లా, అందోల్, నియోజకవర్గం రాయికోడ్, మండలం, పాంపాడ్, గ్రామానికి సంబంధించిన బీటీ



రోడ్డునిర్మాణ పనులుప్రారంభమయ్యాయి.గత (బిఆర్ఎస్)ప్రభుత్వం పదేళ్ల పరిపాలనలో రోడ్లను ఏమాత్రం పట్టించుకోకుండా ఒంటెద్దు పోకడ పోవడంతో, అందోల్ నియోజకవర్గం లోని పాలు మండల గ్రామాలలో రోడ్లన్నీ ధ్వంశమై రాకపోకలకు ప్రయాణికులకుచాలా ఇబ్బందులు కలిగాయి, కానీ ఇప్పుడు ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రత్యేక చోరువ తీసుకుని నియోజకవర్గంలోని రహదారుల కోసం నిధులు కేటాయించి, రహదారి,పనులుప్రారంభించారు, ఎన్నో ఏళు ్లగా ఎదురు చూస్తున్న రాయికోడ్ మండలం పాంపాడు రహదారి నిర్మాన పనులు ప్రారంభం కావడంతో, గ్రామ ప్రజల్లో ఆనందం నెలకొంది, త్వరలోనే నాణ్యమైన బీటీ రోడ్డు, నిర్మాణం పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నారు....

# పంటకుంటలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి.

## :: రాష్ట్ర పంచాయతీరాజ్, శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్ట్ 25 కలెక్టరేట్**మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య, ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మితో కలిసి మంత్రి దనసరి అనసూయ సీతక్క , ఉపాధి హామీ పనులు, పంటకుంటల నిర్మాణం, మహిళా సంఘాల భవనాల నిర్మాణం, నూతన చేయూత పింఛన్ల మంజూరు, వన మహోత్సవం తదితర అంశాలపై అన్ని జిల్లాల జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.




ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్‌రావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 6.18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 5.32 కోట్ల మొక్కలు నాటి 86 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

నాటిన మొక్కల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతోపాటు ప్రతి మొక్కకు క్రమం తప్పకుండా నీరు అందించాలని సూచించారు. మొక్కలకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా రహదారుల వెంట చేపట్టిన మొక్కల పెంపకంలో రక్షణ ఏర్పాట్లు పటిష్టంగా ఉండేలా చూడాలని తెలిపారు.

వన మహోత్సవంలో ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు. మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తయినట్లు భావించకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి, నూరు శాతం మనుగడ సాధించాలని స్పష్టం చేశారు.

ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని ఆదేశించారు. పనికి సిద్ధంగా ఉన్న ప్రతి కూలీకి వారి నివాస ప్రాంతానికి సమీపంలోనే పని అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించేందుకు ప్రతి గ్రామ పంచాయతీలో తగినన్ని పనుల జాబితాను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. కూలీల సమీకరణ బాధ్యతను క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టంగా అప్పగించడంతోపాటు ఎన్ఎంఎంఎస్ విధానంలో కూలీల హాజరు నమోదును ప్రతిరోజూ పర్యవేక్షించాలని తెలిపారు.

మంజూరైన పంటకుంటల పనులను వెంటనే ప్రారంభించి, ఉపాధి కల్పనతోపాటు నీటి సంరక్షణకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులుగా అభివృద్ధి చేయాలని మంత్రి ఆదేశించారు. తక్కువ పనితీరు కనబరుస్తున్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి, స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశిస్తూ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

ఆదివాసీ, గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు, పంటకుంటలు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, నీటి సంరక్షణ, జీవనోపాధికి ఉపయోగపడే ఆస్తుల సృష్టి ఏకకాలంలో జరిగేలా ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని మంత్రి సీతక్క సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఓ రవీందర్, డీపీఓ వెంకయ్య, డిప్యూటీ సీఈఓ, ఏపీడీ, డీపీఎం, ప్లాంటేషన్ మేనేజర్, డీఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

# బి సి వెల్ఫేర్ లెజిస్లేచర్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

తెలంగాణ శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్ లో ఈరోజు బి సి వెల్ఫేర్ లెజిస్లేచర్ కమిటీ ప్రిలిమినరీ సమావేశం నిర్వహించారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు , శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు , మండలి వైస్ ఛైర్మన్ బండ ప్రకాష్, శాసనమండలి, శాసన సభ కార్యదర్శులు నరసింహాచార్యులు, రేండ్ల తిరుపతి బి సి వెల్ఫేర్ లెజిస్లేచర్ కమిటీ ఛైర్మన్ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ని కమిటీ సభ్యులు శ్రీగణేష్, భూపతి రెడ్డి, చింతా ప్రభాకర్, రామారావు పవార్, ఎల్ రమణ, తీన్మార్ మల్లన్న ను అభినందించారు.ఈ సమావేశంలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గారు అత్యంత జనాభా కలిగిన వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ లో తనను సభ్యునిగా నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రివర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపి వెనుకబడిన తరగతుల సంక్షేమానికి, అభివృద్ధికి ఛైర్మన్ సారథ్యంలో కృషి చేస్తానని తెలిపారు

# ఎన్టీఆర్ కెనాల్‌లో కుళ్లిన కోళ్ల కళేబరాలు...

## దుర్వాసనతో లక్ష్మీనారాయణపురం ప్రజల అవస్థలు..

## అధికారుల తక్షణ చర్యలకు డిమాండ్.

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 25:**జనావాసాల మధ్య కోళ్ల ఫారం నిర్వహణ మృతిచెందిన కోళ్లను సమీపంలోని ఎన్టీఆర్ కెనాల్‌లో పడేస్తున్నారన్న ఆరోపణలు. వేంసూరు మండలం లక్ష్మీనారాయణపురం గ్రామంలో కలకలం రేపుతున్నాయి. ఫారంలో మృతి చెందిన సుమారు 10 నుంచి 20 కోళ్ల కళేబరాలను కెనాల్‌లో పడేయడంతో అవి కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కెనాల్‌లోని కళేబరాలను వీధికుక్కలు నోటకరుచుకుని గ్రామంలోని ఇళ్ల వద్దకు తీసుకొస్తుండటంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. దీంతో పరిసరాల్లో అపరిశుభ్రత





నెలకొనడంతో పాటు దుర్వాసన భరించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు.వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల భయం ఉన్న నేపథ్యంలో కోళ్ల వ్యర్థాలను జనావాసాలకు సమీపంలో పడేయడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల విద్యార్థులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కెనాల్‌లో పడేసిన కోళ్ల కళేబరాలను వెంటనే తొలగించి, పారిశుధ్య చర్యలు చేపట్టాలి. నిబంధనలు ఉల్లంఘించిన కోళ్ల ఫారం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి" అని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఏటూర్ నాగారం లోని మీసేవ మరియు ఆధార్ సెంటర్ల తనిఖీలు

## అక్రమ దందాలకు పాల్పడితే సహించబోము : తహశీల్దార్ జగదీశ్వర్

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 25 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం మండలంలోని ఆధార్ మరియు మీసేవ సెంటర్లను ఏటూరు నాగారం తహసిల్దార్ జగదీశ్వర్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ మరియు రెవెన్యూ ఇన్స్పెక్టర్ కిరణ్ లతో కలిసి తనిఖీ చేశారు.




ఇటీవల పలు పత్రికలలో మరియు న్యూస్ చానెల్స్ లో ప్రచురితమైన మీ సేవలో అధిక వసూళ్లు వార్త పైన ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్ మరియు మీసేవ సెంటర్లలో తనిఖీలు చేసి దరఖాస్తు దారుల నుండి అధిక రుసుము వసూలు చేయద్దు అని తీవ్రంగా ఆధార్ నిర్వాహకులను మరియు మీసేవ నిర్వాహకులను తీవ్రంగా హెచ్చరించారు.



మీసేవ కేంద్రాలను ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి జూణ గైడ్లైన్స్ ప్రకారం మీ సేవ కేంద్రాన్ని నడపవలనని సూచించారు.

మీసేవ మరియు ఆధార్ సెంటర్లో తప్పకుండా సిటిజెన్ చాప్టర్, భూభారతి కి సంబంధించిన ఫ్లెక్సీలు, మీసేవ లోగో, మరియు తహసిల్దార్, ఈడీఎం, పరిష్కారం కాల్ సెంటర్ల యొక్క ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ఉండవలెనని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆదేశించారు.

కళ్యాణ లక్ష్మి, ఖణ×ణ(సదరం), బర్త్ మరియు డెత్ సర్టిఫికెట్లు ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని మరియు మీసేవ ఆపరేటర్లు ప్రజల పట్ల సున్నితంగా ఉంటూ వారికి మీసేవ సర్వీసులను మరియు ఇతర అన్ని రకాల ఆన్లైన్ సేవలను అందించాలని ఆదేశించారు.

నిర్ణీత రుసుము కంటే ఎక్కువ రుసుము దరఖాస్తుదారుడు నుంచి తీసుకున్నట్లయితే తప్పనిసరిగా అట్టి మీసేవ సెంటర్ పై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ జగదీశ్వర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్ మరియు మీసేవ మరియు ఆధార్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ జోన్‌లో నకిలీ వైద్యులపై టాస్క్‌ఫోర్స్ కొరడా

జూబ్లీహిల్స్ జోన్ పరిధిలో అర్హతలు లేకుండా వైద్యులుగా చలామణి అవుతూ చికిత్స చేస్తున్న వారిపై కమిషనర్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు.ఆరు మంది నకిలీ వైద్యులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.అర్హతలు లేకుండానే వైద్యులుగా చెప్పుకుంటూ రోగులకు చికిత్స అందిస్తున్నట్లు ఆరోపణలు.ఎం సెలైన్/గ్లూకోజ్, ఇంజెక్షన్లు, సర్జికల్ స్టిచెస్ వంటి చికిత్సలు చేస్తున్నట్లు పోలీసుల వెల్లడి.మందుల దుకాణాలకు అనుబంధంగా క్లినిక్‌లు నిర్వహిస్తూ రోగుల నుంచి కన్సల్టేషన్ ఫీజు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు.1. మధురానగర్ ? శ్రీ ఆక్వా ఫస్ట్ ఎయిడ్ సెంటర్:రహ్మత్‌నగర్ ఎక్స్‌రోడ్ సమీపంలోని శ్రీ ఆక్వా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌పై దాడి చేసి ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.రాగం సుధాకర్ అనే వ్యక్తి డాక్టర్‌గా చెప్పుకుంటూ రోగులకు చికిత్స అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రోజుకు సుమారు 40?50 మంది రోగులకు వైద్యం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.సీజ్ చేసిన సామగ్రిబటర్‌ఫ్లై, సర్జికల్ నీడిల్స్, సిరంజీలు, లోకల్ అనస్థీషియా, ఇంజెక్షన్ బాటిల్స్, సర్జికల్ కత్తెరలు, సెలైన్ బాటిల్స్ తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన వస్తువుల విలువ సుమారు రూ.10 వేలుగా పేర్కొన్నారు.2. మధురానగర్ ? రహ్మత్‌నగర్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్:అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మరో ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌పై దాడి చేసి మిరుడొడ్డి భారతి అనే మహిళను అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల ప్రకారం ఆమె డాక్టర్‌గా చెప్పుకుంటూ రోజుకు 10?15 మంది రోగులకు చికిత్స అందించడంతో పాటు ఎం సెలైన్, ఇంజెక్షన్లు, సర్జికల్ స్టిచెస్ వంటి వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.3. జూబ్లీహిల్స్ ? వెంకటగిరి:వెంకటగిరిలో పేరులేని క్లినిక్‌పై దాడి చేసి కటిక మహేష్‌రావును అదుపులోకి తీసుకున్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.

### :: జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 25 ములుగు** వన మహోత్సవం సందర్భంగా మంగళవారం ములుగు గట్టమ్మ సమీపంలోని పంచాయతీరాజ్ ఫైలాన్ ఆవరణలో జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మొక్కలు, అడవులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతోపాటు వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ప్రకృతిని పరిరక్షించే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను కాపాడినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ములుగు ఎఫ్‌డీఓ సత్తయ్య, జాకారం సర్పంచ్, అటవీ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా వన మహోత్సవం



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 25 ఏటూరు నాగారం** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏటూరు నాగారం నందు వన మహోత్సవం సందర్భంగా కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏటూరు నాగారం అటవీశాఖ వారి సహకారంతో పెద్ద ఎత్తున వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్, బి. రేణుక ప్రారంభించగా ముఖ్య అతిథులుగా హాజరైన మనన్ భట్ ఐపీఎస్ ,ా. రమేష్ ఎ సి ఎఫ్ ఎఫ్ డి ఓ/, శ్రీ జగదీశ్వర్ ఎమ్మార్వో, శ్రీ శ్రీనివాస్ ఎంపీడీవో జీ. సూర్య ప్రకాష్ సీఐ ఏటూరు నాగారం, పంజాల. భాస్కర్ ఎఫ్ ఆర్ వో ములుగు జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు ఏటూరు నాగారం ఆత్మ చైర్మన్ అరుణ బి మహేష్ ఎస్సై ఏటూరు నాగారం చేతుల మీదుగా కళాశాల ఆవరణంలో మొక్కలు నాటడం జరిగింది.

ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, మరియు కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సిహెచ్.వెంకటయ్య, డాక్టర్, డి. నవీన్, డాక్టర్, పి. జ్యోతి, కనీస్ ఫాతిమా, సంపత్, జీవవేణి, రమేశ్, శ్రీధర్, రాజశేఖర్, భావన, భారతి, భాస్కర్, శ్రీకాంత్ మరియు బోధనేతర సిబ్బంది,పాత్రికేయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వీధి వ్యాపారుల వద్ద మధ్యవర్తుల అక్రమ వసూళ్లపై విచారణ జరపి చట్టరీత్యా చర్యలు చేపట్టాలీ: ది సిటిజన్స్ కౌన్సిల్.




**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 25 ఆగస్టు 2026**మణికొండ మున్సిపాలిటి సమయంలో వీధి వ్యాపారుల వద్ద డబ్బులు వసూలు చేయడానికి థాయ్ బజార్ నిర్వహణకు టెండర్లు పిలిచిన దరిమిలా, జీవనోపాధి పరిరక్షణ వీధి వ్యాపార నియంత్రణ చట్టం 2014 ను అమలు చేయాలని కోరుతూ ది సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో తెలంగాణ అత్యుత్తమ న్యాయ స్థానంను ఆశ్రయించడం ద్వారా థాయ్ బజార్ పేరుతో డబ్బు వసూలు ఆపడం జరిగినది. దీంతో చిన్న వ్యాపారులు కొంత మేర లబ్ధి పొందారు. మణికొండ మున్సిపాలిటీని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసిన తర్వాత వీధి వ్యాపారలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సౌకర్యం కల్పించకుండా జీవనోపాధి పరిరక్షణ వీధి వ్యాపార నియంత్రణ చట్టం 2014కి విరుద్ధంగా వీధి వ్యాపారులను రోడ్లపై నుంచి తొలగించడం, సంప్రదింపులు, విజ్ఞప్తుల అనంతరం నార్సింగి డిప్యూటీ కమిషనర్ కొన్ని షరతులతో వీధి వ్యాపారులకు అనుమతి ఇచ్చారు. కేవలం మూవబుల్ స్ట్రీట్ వెండర్స్ మాత్రమే వ్యాపారం చేయాలని, పారిశుధ్యం కోసం ?50 నిర్ణయించి వారపు మార్కెట్ సంత అనంతరం పరిసరాలను శుభ్రపరచు కోవాలని సూచించారు. అయితే ప్రస్తుతం వీధి వ్యాపారుల చెత్త ఉన్నా లేకున్నా చెత్త ఉన్నట్లు ఆరోపిస్తూ రసీదు ఇస్తూ 1,000/- మరియూ అనధికారికంగా రసీదు ఇవ్వకుండా మరొక 1,000/- జరిమానాగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇట్టి చట్టరీత్యా ఆమోదయోగ్యం కాని వసూళ్లు నిజమైతే వీధి వ్యాపారుల చట్టం 2014 స్ఫూర్తికి విరుద్ధం కావున పేద వీధి వ్యాపారుల జీవనోపాధికి తీవ్ర అన్యాయం చేస్తున్న వసూళ్ల దారులపై నార్సింగి మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ చట్టరీత్యా చర్యలు చేపట్టాలని ది సిటిజన్స్ కౌన్సిల్ చైర్మన్ సితారాం ధూళిపాల, అద్యక్షుడు ఉపేంద్రనాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, కార్యదర్శి ఆరీఫ్ మహమ్మద్, సభ్యులు రామసుబ్బా రెడ్డి, సాగర్, మాజీ కోశాధికారి దిలీపు కక్కడ తదితరులు డిమాండ్ చేస్తోన్నారు.

## చిత్తడి నేలల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.

### జలవనరుల హద్దులను క్షేత్రస్థాయిలో పక్కాగా గుర్తించాలి.

### :: జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 25 కలెక్టరేట్**మంగళవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి చిత్తడి నేలల కమిటీ సమావేశం నిర్వహించారు.

జిల్లాలోని చిత్తడి నేలల గుర్తింపు, సర్వే, హద్దుల నిర్ధారణ, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిత్తడి నేలలు, జలవనరుల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని జలవనరులను క్షేత్రస్థాయిలో పరిశీలించి,

వాటి విస్తీర్ణం, హద్దులకు సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సర్వే, హద్దుల నిర్ధారణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, సమగ్ర నివేదికను రాష్ట్ర చిత్తడి నేలల ప్రాధికార సంస్థకు పంపించాలని ఆదేశించారు.

జలవనరుల పరిశీలనలో నీటిపారుదల, అటవీ, రెవెన్యూ శాఖలు ప్రధాన బాధ్యత వహించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పురపాలక, కాలుష్య నియంత్రణ మండలి, మత్స్య, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం లోపించకుండా క్షేత్రస్థాయి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రతి జలవనరును స్వయంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే సంబంధిత శాఖల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ సంపత్, డి పి ఓ వెంకయ్య, డి ఏ ఓ సురేష్ కుమార్, జిల్లా ఉద్యానవ శాఖ అధికారి సంజీవ రావు, డి ఆర్ డి ఓ రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాబలం వార్తకు స్పందించిన గ్రామపంచాయతీ కంపు కొడుతున్న గ్రామపంచాయతీ అనే శీర్షికపై



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 25 ఏటూరునాగారం** ఏటూరు నాగారం మేజర్ గ్రామపంచాయతీ ప్రజాబలం వార్తపై స్పందించి 15వ వార్డు నెంబర్ నాగవత్ కిరణ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బందితో కాల్వలు శుభ్రం చేస్తూ చెట్లను తొలగించారు దీనితో ఆ పరిసర ప్రాంతాలు శుభ్రంగా తయారు కావడంతో చాలా రోజుల నుంచి పడి ఉన్న చెత్తను ఈరోజు శుభ్రం చేయడంతో 15వ వార్డు సభ్యుడు నాగవత్ కిరణ్ కు కృతజ్ఞతలు తెలియజేసిన హాస్టల్ సిబ్బంది ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## ఐ.హెచ్.ఎం శ్రీ శక్తి కళాశాలలో ఘనంగా ఓణం సద్య సంబరాలు




బేగంపేట్లోని శ్రీ శక్తి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ ప్రాంగణంలో ఓనం పర్వదినాన్ని పురస్కరించుకుని ఓనం సద్య కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ రుచులతో కూడిన వివిధ రకాల రుచికరమైన వంటకాలను అతిథులకు వడ్డించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ కళారూపాలు, నృత్యాలు తదితర ప్రదర్శనలతో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి హాస్పిటాలిటీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు, ప్రతినిధులు హాజరై విద్యార్థుల ప్రతిభను, వారి కృషిని అభినందించారు. వంటకాల తయారీ, ప్రదర్శన, అతిథి సత్కారం వంటి అంశాల్లో విద్యార్థులు ప్రదర్శించిన నైపుణ్యాన్ని వారు ప్రశంసించారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ఓనం వేడుకలను విజయవంతం చేశారు. విద్యార్థుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలతో పాటు సాంస్కృతిక విలువలు, బృందస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది.



### భూమారెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా. పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు

### - లక్ష మంది సంతకాలు చేసినయాంటీ డ్రగ్ అవేర్నెస్ ఫ్లెక్సీ నీ ఆవిష్కరించిన రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా.

### - విద్యార్థులు, యువకులతో నషా ముక్త్ ప్రతిజ్ఞ చేయించిన గవర్నర్.

నిజామాబాద్ ఎంపీ శ్రీ ధర్మపురి అరవింద్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం దాన కిషోర్, నగర మేయర్ ఉమారాణి,నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా,ఆర్మూర్ ఎమ్మెల్యే శ్రీ పి. రాకేష్ రెడ్డి,నిజామాబాద్ జిల్లా కలెక్టర్ శ్రీ భవేష్ మిశ్రా, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య.

## మిలాద్ ఉన్ నబీపై పీస్ కమిటీ సమావేశం



**వేములవాడ ప్రజాబలం దినపత్రిక (ఆగస్టు -25 )**మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డీఎస్పీ ఏ. శ్రీనివాసులు ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. వీరప్రసాద్, ఎస్సై రాహుల్ రెడ్డి, ముస్లిం మత పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పండుగను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలు చేపడతామని, శాంతిభద్రతల పరిరక్షణలో మత పెద్దలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఫీజుల బకాయిలపై 'బీజేపీ లడాయి' విజయవంతం!

కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన నిరంకుశ ఆంక్షలను, అడ్డంకులను బద్దలుకొడుతూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు చేపట్టిన మహా నిరాహార దీక్ష విజయవంతంగా ముగిసింది.నిన్నటి నుంచి కొనసాగుతున్న దీక్షను ఈరోజు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు న్. రాంచందర్ రావు కి నిమ్మరసం తాగించి విరమింపజేయడం జరిగింది.విద్యార్థుల భవిష్యత్తు కోసం, పేద తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించేందుకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ చేస్తున్న పోరాటం కొనసాగుతుంది.విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ లడాయి ? ఆగదు!ఫీజుల బకాయిలు విడుదల చేసే వరకు పోరాటం కొనసాగుతుంది!

## మర్పల్లి ఫారం ఫండ్స్, పనులు చేద్దాం భూగర్భ జలాలు పెంచుదాం, ఎంపీడీవో శాంతమ్మ, ఏపీవో అంజిరెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 25(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలంలో 16 జిపి లయందు ఫారం పాండు పనులు జరుగుచున్నవి 23 ఫారం పాండులు ఇన్ ప్రోగ్రెస్ లో ఉన్నాయి మొత్తము 87 ఫారం పండులు మంజూరైనవి ఎంపీడీవో శాంతమ్మ మేడం , మర్పల్లి ఫారంఫండ్ వర్క్ సైట్ ఇన్స్పెక్షన్ చేయడం ఫీల్డ్ అసిస్టెంట్ కు పలు సూచనలు చేయడం జరిగినది ఫారం ఫండ్స్



పనులు ప్రతి గ్రామంలో చేద్దాం భూగర్భ జలాలను పెంచుదాం అని ఎంపీడీవో శాంతమ్మ తెలిపారు అదేవిధంగా ఉపాధి హామీ పని వారు నిదానంగా అలసట రాకుండా పని ప్రదేశంలో పనులు ముగించుకొవ లని ఏపీవో అంజిరెడ్డి తెలిపారు,టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ , ఏపీఓ అంజి రెడ్డి , బలవంత్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బి శేఖర్,లక్ష్మణ్ , పాల్గొన్నారు

## ప్రజల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం--బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలి మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్




**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఆగస్టు 25:**లి ప్రజల ఆర్థికాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం, బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.

బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆర్థిక చేయూత అందించి వారి అభ్యున్నతికి బ్యాంకులు సహకరించాలని అదనపు కలెక్టర్ కోరారు. బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంతో పాటు ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు అవసరమైన రుణాలు, ఆర్థిక సహాయం అందించాలన్నారు. జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశాలకు హాజరయ్యే బ్యాంకర్లు పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పేదలు, బలహీన వర్గాలకు బ్యాంకులు మరింతగా చేయూత అందించాలని కోరారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలను సకాలంలో మంజూరు చేసి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని బ్యాంకర్లకు సూచించారు. రుణాల విషయంలో ఎలాంటి అదనపు రుసుములు విధించకూడదని స్పష్టం చేశారు. బ్యాంకుల వద్ద లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారికి సౌకర్యవంతమైన సేవలు అందించాలని కోరారు.

షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, ఇతర బలహీన వర్గాలకు అందుబాటులో ఉన్న వివిధ రుణ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ముద్ర, ప్రధానమంత్రి విశ్వకర్మ, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమల అభివృద్ధి పథకం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ ఉపాధి--వ్యాపార ప్రోత్సాహక పథకాల ద్వారా యువత, మహిళలు, స్వయం ఉపాధిదారులకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. రుణాలపై లబ్ధిదారులకు ఉన్న సందేహాలను బ్యాంకు అధికారులు నేరుగా సంప్రదించి నివృత్తి చేయాలని సూచించారు. బ్యాంకింగ్ సేవలకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. సమస్యలను పరిశీలించి త్వరలో పూర్తి వివరాలు అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కు ధర్నా నోటీసు ఇచ్చిన జె.ఏ.సి.ఉద్యోగులు



ఈనెల 27న నాగర్ కర్నూల్ కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించనున్న మహా ధర్నాకు సంబం ధించిన నోటీసును మంగళవారం నాగర్ కర్నూలు జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ బావండ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో కలెక్టర్ గారికి వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా జాక్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ఎంతో కాలంగా పెండింగ్లో ఉన్నాయని, ముఖ్యంగా పీఆర్సీ, పాత పెన్షన్ పునరుద్ధరణ, పెండింగ్లో ఉన్న 6



డీఏల మంజూరు, హెల్త్ స్కీమ్ అమలు, పెండింగ్ బిల్లుల మంజూరు, తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలనే డిమాండ్ తో ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని విజవయంతం చేయాలని జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు షర్ఫోద్దీన్,

సత్యనారాయణ రెడ్డి, కృష్ణ, వెంకటప్ప, సురేషు, నజీర్, కళ్యాణ్ కృష్ణారావు, బాలరాజ్, మహేష్, రాజు గౌడ్, మహిళా నాయకులు శివ రత్న ,అరుణ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి చేయూత




**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, ఆగస్టు 25:** తాను చదువుకున్న తిప్పాపురం ఎంపీపీఎస్ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి సయ్యద్ సాబీర్ చేయూత అందించారు. దాతల సహకారంతో పాఠశాలలోని మూడు భవనాలకు రంగులు వేయించారు.

ఈ సందర్భంగా పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సుజాత, సయ్యద్ సాబీర్‌లను సన్మానించారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకోవాలనే ఉద్దేశంతో



భవనాలకు రంగులు వేయించినట్లు సాబీర్ తెలిపారు. భవిష్యత్‌లోనూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానన్నారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ఎల్లా శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బీసీ మహిళలకు వంద శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు...

### ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 25 ప్రజాబలం:** ఖమ్మం జిల్లాలో బీసీ మహిళలను ఆర్థికంగా స్వావలంబన కలిగిన మహిళా పారిశ్రామిక




వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.

బీసీ సంక్షేమశాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఖమ్మం జిల్లాలో ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ పథకం క్రింద జిల్లాలోని ప్రతి శాసనసభ నియోజక వర్గానికి 1,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లు చొప్పున, ఒక్కో యూనిట్ విలువ 12 వేలు 100 శాతం ఉచిత సబ్సిడీపై అర్హులైన బీసీ మహిళలకు అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళలు బీసీ వర్గానికి చెందిన నిరుద్యోగ మహిళలై ఉండాలని, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలు, అలాగే మేరా/మేరు కమ్యూనిటీకి చెందిన మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలకు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షలకు మించకూడదని, తెల్ల రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం క్రింద అవకాశం ఉంటుందని, కుట్టు వృత్తిలో నైపుణ్యం కలిగిన వారికి, అలాగే కనీస ప్రాథమిక అక్షరాస్యత ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హులైన బీసీ మహిళలు సెప్టెంబర్ 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులను స్త్రశీఎఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ పోర్టల్ ద్వారా సమర్పించాలని తెలిపారు.

అర్హత కలిగిన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్దేశిత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.

## తల్లాడ మేజర్ పంచాయతీలో ఘనంగా వనమహోత్సవం.



**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 25 ప్రజాబలం:**తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో వనమహోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ,హరితహారం లక్ష్యంగా మండల కేంద్రంలో విస్తృతంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) ఉమా, తాసిల్దార్ టీ కరుణాకర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీధర్ రాజు, తల్లాడ గ్రామ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, తల్లాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుడిపల్లి నారాయణ హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉమా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో వృక్షాల పాత్ర కీలకమన్నారు. అనంతరం సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామాన్ని హరిత గ్రామంగా మార్చేందుకు పంచాయతీ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందని, నాటిన ప్రతి మొక్కను రక్షించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు, సెక్రటరీ, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు..

# నశాముక్త సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కీలకం

## -నిజామాబాద్‌లో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా










నిజామాబాద్, ఆగస్టు 25,2026: నశాముక్త సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. మాదకద్రవ్యాల ప్రభావానికి యువత దూరంగా ఉండి, విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, నవకల్పన, దేశసేవ వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

మంగళవారం నిజామాబాద్ భూమారెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమానికి' గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 'నశాముక్త భారత్ అభియాన్' విస్తృత ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటోందన్నారు. మాదకద్రవ్యాలపై చట్టపరమైన చర్యలతోపాటు యువతలో అవగాహన, చైతన్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించడం కూడా ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన జూూ+ాజు కార్యక్రమంతోపాటు పోలీసుశాఖ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు, ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా విద్యార్థులను చైతన్యవంతం చేయడం మంచి ప్రయత్నమని అన్నారు. విద్యాసంస్థల పరిసరాల్లో మాదక, హానికర పదార్థాల లభ్యతను నియంత్రించడంతో పాటు చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సేవలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

నశాముక్త సమాజం కోసం పోలీసు, యంత్రాంగం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని గవర్నర్ సూచించారు. నిజామాబాద్ పోలీసులు చేపడుతున్న విస్తృత అవగాహన కార్యక్రమాలు, సమర్థవంతమైన అమలు చర్యలు ప్రశంసనీయమన్నారు.

### యువతే దేశానికి బలం

"యువతలోని శక్తి, ప్రతిభ, కలలే దేశానికి అతిపెద్ద సంపద. వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ మాదకద్రవ్యాలకు బలి చేయొద్దు" అని గవర్నర్ విద్యార్థులకు సూచించారు. స్వామి వివేకానంద పిలుపైన 'లేచి నిలబడండి.. మేల్కొనండి.. లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి' అనే సందేశాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

లోహంలాంటి కండరాలు, ఉక్కులాంటి నరాలు, వజ్రంలాంటి సంకల్పం కలిగిన యువత దేశానికి అవసరమన్నారు. అటువంటి అంకితభావం కలిగిన కొద్దిమంది యువకులు కూడా దేశంలో, ప్రపంచంలో గొప్ప మార్పు తీసుకురాగలరని పేర్కొన్నారు.

ఆసక్తి, క్షణిక ఆకర్షణ కారణంగా యువత జీవితం తప్పుదారి పట్టే అవకాశం ఉందని గవర్నర్ హెచ్చరించారు. ప్రతి యువకుడు విచక్షణ, ఆత్మనియంత్రణను జీవితానికి మార్గదర్శకంగా చేసుకోవాలని సూచించారు. మిత్రుల్లో ఎవరైనా నశా వైపు వెళ్తున్నట్లు గుర్తిస్తే వారిని ఒంటరిగా వదిలేయకుండా మార్గదర్శనంతో సరైన దారిలోకి తీసుకురావాలని అన్నారు.

'నశాకు నో.. జీవితానికి ఎస్' అనే నినాదం కేవలం నినాదంగా కాకుండా ప్రతి యువకుడి జీవిత సంకల్పంగా మారాలని ఆకాంక్షించారు.

### తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే కీలక పాత్ర

పిల్లలతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం సంభాషిస్తూ నమ్మకం, ఆప్యాయతతో వ్యవహరించాలని గవర్నర్ సూచించారు. హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా తాను పనిచేసిన సమయంలో నశా వ్యతిరేక కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని స్వయంగా చూశానని తెలిపారు. యువత, కుటుంబాలు, విద్యాసంస్థలు, స్థానిక సమాజం కలసికట్టుగా పనిచేస్తే సామాజిక సమస్యలను సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు.

తెలంగాణలోనూ లి'నశాముక్త భారత్ జన ఆందోళన్'లిలో భాగంగా జూన్ 19న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యుల సమక్షంలో విద్యార్థులతో నశాముక్త జీవితం కోసం ప్రతిజ్ఞ చేయించిన విషయాన్ని గవర్నర్ గుర్తుచేశారు.

### నిజామాబాద్ మరింత అభివృద్ధి చెందాలి

నిజామాబాద్ గొప్ప చరిత్ర, సంస్కృతి, సాహిత్య వారసత్వానికి ప్రతీక అని గవర్నర్ అన్నారు. నిజామాబాద్ వ్యవసాయం, విద్య, పరిశ్రమలు, సమగ్ర అభివృద్ధి రంగాల్లో మరింత ముందుకు సాగాలని గవర్నర్ ఆకాంక్షించారు.

ప్రతి పాఠశాల సురక్షితంగా.. ప్రతి యువత చైతన్యవంతంగా.. ప్రతి కుటుంబం నశా దుష్ప్రభావాల నుంచి రక్షితంగా ఉండేలా సమాజం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన యువతే బలమైన సమాజాన్ని నిర్మిస్తుందని, బలమైన సమాజమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేస్తుందని గవర్నర్ పేర్కొన్నారు.

నశాముక్త తెలంగాణ.. నశాముక్త భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఎంపీ శ్రీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ... నషా తో సర్వం వినాశన మే అని పేర్కొంటూ యువత , విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు.

అంతకుముందు రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా

లక్ష మంది సంతకాలు చేసిన యాంటీ డ్రగ్ అవేర్నెస్

ఫ్లెక్సీ నీ ఆవిష్కరించారు. విద్యార్థులు, యువకులతో నషా ముక్త్ ప్రతిజ్ఞ చేయించారు. నషా ముక్త్ భారత్ కింద నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులకు గవర్నర్ మెమెంటో లు అందించి అభినందించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువకులు హాజరయ్యారు.

# బద్ది పోచమ్మ ఆలయం భక్తజన సంద్రమయం



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, ఆగస్టు 25:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయం అయిన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. మహిళా భక్తులు సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతి కార్యక్రమాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ సిబ్బంది అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు దర్శనంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లను క్రమబద్ధీకరించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి రద్దీని నియంత్రించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. బద్ది పోచమ్మ ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తుండటంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.



# ఐఏఎస్ జితేష్ వి పాటిల్ ను కలిసిన జిల్లా దిశా కమిటీ సభ్యుడు

### - రైతులకు సోలార్ విద్యుత్ తో గిరి వికాస్ బోర్లను ప్రారంభించాలి

### - గ్రామాల్లో ఉన్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త విద్య స్తంభాలు ఏర్పాటు చేయండి

**చంద్రుగొండ ఆగస్టు 25 ప్రజాబలం ప్రతినిధి** :-తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ కమిషనర్ జితేష్ వి పాటిల్ ఐఏఎస్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశా కమిటీ సభ్యుడు బొర్రా సురేష్ మర్యాదపూర్వకంగా హైదరాబాదులో దక్షిణ విద్యుత్ పంపిణీ కార్యాలయంలో కలిసారు. చంద్రుగొండ మండలంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయించిన గిరి వికాస్ బోర్లకు సోలార్ విద్యుత్ ద్వారా గిరి వికాస్ బోర్లను ప్రారంభించాలని, జిల్లాలోని ఎన్నో ఏళ్లుగా శిథిలా వ్యవస్థకు చేరుకున్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో నూతన స్తంభాలను ఏర్పాటు చేయాలని, రాబోయే రోజుల్లో విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయంగా నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాలని, రైతులకు విద్యుత్ పై అవగాహన కల్పిస్తూ నూతన కలెక్షన్లు ఆలస్యం లేకుండా మంజూరు చేయాలని వినతిపత్రం రూపంలో ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించి ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే గతంలో జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించినప్పుడు బెండలపాడు గ్రామ శివారులోని పల్లేరు వీరభద్ర స్వామి టెంపుల్, కనకాద్రి గుట్టలకు, పలుసార్లు వచ్చానని, అక్కడ ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణ ఉంటుందని త్వరలోనే మరోసారి కూడా ఆ ప్రాంతాన్ని సందర్శిస్తానని వారికి తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా రాష్ట్ర స్థాయి కమిషనర్ గా ఎంపికైన సందర్భంగా శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్.యుఐ డిస్టిక్ సెక్రెటరీ పటేల్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు దేశ బోయిన సంపత్, బొగ్గుల శివ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# కోడెల మృతిపై విచారణ

## స్వయంగా పరిశీలిస్తానన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న గోశాలలో ఐదు కోడెలు మృతి చెందిన ఘటనపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. కోడెలు అనారోగ్యంతో మృతి చెందినట్లు నిర్వాహకులు చెబుతున్నారని తెలిపారు. ఘటనపై వాస్తవాలను తెలుసుకునేందుకు రేపు తాను స్వయంగా గోశాలను సందర్శించి పరిశీలిస్తానన్నారు. పశువులకు అందుతున్న వైద్యం, ఆహారం, నీరు, గోశాల నిర్వహణపై ఆరా తీస్తామని చెప్పారు. సమగ్ర విచారణ జరిపి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు

# యూకె ప్రభుత్వంతో ఏపీ మున్సిపల్ శాఖ ఒప్పందం

అమరావతి మంత్రి నారాయణ సమక్షంలో మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్, యూకె ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసారు. సమావేశానికి ఏపీ,తెలంగాణ బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ విన్ ఒవెన్ హాజరయ్యారు.

మంత్రి నారాయణ మాట్లాడుతూన్ర్ఫాస్ట్రక్చర్, ప్రభుత్వ భాగస్వామ్యాలపై రెండు ప్రభుత్వాల అధికారుల చర్చలు చేశాం. అమరావతితో పాటు అన్ని మునిసిపాలిటీల అభివృద్ధికి యూకే ప్రభుత్వం సహకారం అందించనుంది. ప్రపంచంలోని టాప్ 5 నగరాల్లో ఒకటిగా అమరావతి నిర్మాణానికి ఎంఓయూ ఉపయోగపడుతుంది. ఇన్ ఫ్రాస్ట్రక్చర్,అర్బన్ ప్లానింగ్,టెక్నాలజీ ట్రాన్స్ఫర్,అర్బన్ మొబిలిటీ లపై కలిసి పనిచేస్తారు. కేంద్ర – రాష్ట్ర నిధులతోఏ మునిసిపాలిటీల్లో 40 వేల కోట్ల విలువైన పనులు ప్రారంభించాం. రాష్ట్ర ఆర్ధిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా....మౌలిక వసతులకు సీఎం ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com